**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 96, పేజీలు - 08

సోమవారం,అక్టోబర్ 05, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు..

## కాంగ్రెస్‌కు అసలు సవాల్!



- రెండు స్థానాల్లోనూ రెడ్డి అభ్యర్థులే.. బీసీ అసంతృప్తిపై పార్టీలో చర్చ
- ముందస్తు అభ్యర్థుల ప్రకటనతో ప్రచారంలో కాంగ్రెస్ దూకుడు
- 7 లక్షల మంది పట్టభద్రుల ఓటర్ల నమోదే టార్గెట్.. గెలుపుపై సీఎం రేవంత్ ఫోకస్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ ముందస్తు వ్యూహంతో కదులుతోంది. ప్రత్యర్థి పార్టీల కంటే ముందుగానే రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం ద్వారా ప్రచారంలో తొలి అడుగు వేసింది. అయితే రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడం పార్టీకి కొత్త సవాల్‌గా మారింది. బీసీ వర్గాల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోందన్న చర్చ కాంగ్రెస్‌లో సాగుతోంది.

### గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం

మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ స్థానానికి టీపీసీసీ మీడియా వింగ్‌లో పనిచేసిన సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలను కాంగ్రెస్ బరిలోకి దింపింది.

ఇద్దరికీ ఆయా ప్రాంతాల్లో పరిచయాలు, వ్యక్తిగత నెట్‌వర్క్‌తో పాటు ఆర్థికంగా బలమైన నేపథ్యం ఉండటం కలిసొచ్చే అంశంగా పార్టీ భావిస్తోంది. సామాజిక సమీకరణాల కంటే అభ్యర్థుల వ్యక్తిగత బలం, పట్టభద్రుల్లో ఉన్న పరిచయాలు, ప్రచార సామర్థ్యం, ఆర్థిక వనరులు, గెలిచే అవకాశాలనే ప్రాతిపదికగా ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

### మంత్రులకు బాధ్యతలు

రెండు స్థానాల్లో గెలుపును కాంగ్రెస్ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు మంత్రులను ఇన్‌ఛార్జులుగా నియమించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్లను క్షేత్రస్థాయిలోకి దించి ఓటర్ల నమోదు, ప్రచార బాధ్యతలు అప్పగించేలా కార్యాచరణ రూపొందిస్తోంది.

### ఓటర్ల నమోదుపైనే అసలు ఫోకస్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఓటర్ల

2లో..

# రోడ్డెక్కిన ఠాక్రే బ్రదర్స్

### - సీఈసీ రాజీనామాకు భారీ విరాట్ గర్జనతో సమరశంఖం




ముంబై (ప్రశ్న న్యూస్)దేశంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ కేంద్ర ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు సమరభేరి మోగించాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ ఆర్థిక రాజధాని ముంబై వీధులు శని, ఆదివారాల్లో హోరెత్తిపోయాయి. ఆదివారం ముంబైలో శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే ఇద్దరూ కలిసి ఈ భారీ నిరసన ర్యాలీకి నాయకత్వం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. 'విరాట్ గర్జన మోర్చా' పేరిట చేపట్టిన ఈ మహా నిరసన ప్రదర్శనకు విపక్షాల నుంచి భారీ స్పందన లభించింది. సౌత్ ముంబైలోని మెట్రో సినిమా ప్రాంతం నుంచి బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ మోర్చాలో ఏ రాజకీయ పార్టీ జెండాలకూ అనుమతి ఇవ్వకపోవడం

2లో..

## కరవు పరిస్థితులు చూస్తుంటే

# కడుపు తరుక్కుపోతోంది

### - తెలంగాణను కేంద్రం ఆదుకోవాలన్న కవిత

- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కరవు పరిస్థితి చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వరుణయాగం చేసి చేతులెత్తేశారని విమర్శించారు. ఇప్పటికీ కరవు మండలాలను ప్రకటించకపోవడం వల్ల రైతులకు కేంద్రం నుంచి రావాల్సిన సహాయం అందడం లేదన్నారు. ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని ఆరు నెలల ముందే ప్రపంచానికి సైంటిస్టులు హెచ్చరించారని కానీ ఈ ప్రభుత్వం ఏనాడూ కనీసం

2లో..

## తెలంగాణలో ఎస్ఐఆర్ అరాచకాలు..?

### - కారణం చెప్పకుండానే 2 లక్షల నోటీసులు!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ (సర్)పై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ ఒక్కొక్కటిగా ఇందులో అక్రమాలు బయటపడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎస్ఐఆర్ లో చేసిన పనులు ఒక్కో రాష్ట్రంలో వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియలో జారీ చేసిన 2 లక్షలకు పైగా నోటీసుల్లో

2లో..

# 2029 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు

### - 9లక్షల ఇళ్లతో పేదలకు పట్టాభిషేకం



- రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్




అమరావతి (ప్రశ్న న్యూస్) 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ వంద శాతం పక్కా ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పేదలకు సొంతిల్లు ఉంటే వారి జీవన ప్రమాణాలతో పాటు ఆత్మగౌరవం పెరుగుతుందని అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో ఆదివారం

2లో..

## ప్రజల ఆశలు నెరవేర్చడం

# చంద్రబాబు ద్వారానే సాధ్యం

### - బుర్రిపాలెంలో శివరాజ్ సింగ్ చౌహాన్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్త ఆకాంక్షలు నెరవేర్చగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. చంద్రబాబు ఒక డైనమిక్, డెడికేటెడ్, డెసిసివ్ నాయకుడని, ఆయన విజన్‌కు తాను సెల్యూట్ చేస్తున్నానని కొనియాడారు. తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో జరిగిన 3 లక్షల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల కలలను సాకారం చేయడానికి చంద్రబాబు నాయకత్వం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

### టెక్నాలజీతో రాష్ట్రాభివృద్ధికి బాటలు

భవిష్యత్తులో దేశానికి అతిపెద్ద శక్తి టెక్నాలజీయేనని చంద్రబాబు ఎప్పుడో గుర్తించారని

2లో..

# తెలంగాణకు బీసీ సీఎం అవుతారు

### - రేవంత్, రాహుల్ మద్దతిస్తారు

### - టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ శంషాబాద్‌లో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని, అందుకు తమ నాయకులు రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ మద్దతు ఇస్తారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, బీసీల గురించి ఇంత గట్టిగా మాట్లాడుతున్నామంటే అందుకు రాహుల్ గాంధీ కారణమని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రివర్గంలో బీసీల సంఖ్యను పెంచుతామని, ఎమ్మెల్యేల్లోనూ వాటా పెరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు."ఈ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి అయి తీరుతాడని ఘంటాపథంగా చెబుతున్నాను, రాహుల్ గాంధీ, రేవంత్ బీసీల హక్కుల కోసం ఈ ధైర్యం రాహుల్ గాంధీ ఇచ్చింది, మల్లికార్జున ఖర్గే ఇచ్చిన

2లో..

## ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో

# కీలకముందడుగు

### - క్లిష్ట దశను దాటామన్న మంత్రి ఉత్తమ్

### - 2028 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన భూగర్భ పరిస్థితులను అధిగమించి కీలక ముందడుగు వేశామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన

2లో..



# కేబీఆర్ పార్కు స్టీల్ బ్రిడ్జీల ప్రాజెక్టు రద్దు

### - పంజాగుట్ట- జూబ్లీ చెక్‌పోస్టు ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

### - కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ

### - ఐటీ కారిడార్ వైపు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కల్పించడమే లక్ష్యం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరానికి కీలకమైన కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు ప్రధాన కూడళ్లలో చేపట్టాలని ప్రతిపాదించిన స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి బ్రేక్ పడింది. మొత్తం రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీలుగా చేపట్టిన ఈ పనులను రద్దు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. నిర్మాణ పనులు ప్రారంభిస్తే కొంతకాలం పాటు నగరంలోని ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

3లో..

# సింగీతంకు కన్నీటి వీడ్కోలు

### - చెన్నైలో ముగిసిన అంత్యక్రియలు

చెన్నై (ప్రశ్న న్యూస్) భారతీయ సినీ యవనికపై తనదైన ముద్ర వేసిన విలక్షణ దర్శకుడు, లెజెండరీ ఫిలింమేకర్ సింగీతం శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. చెన్నైలో ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు చెన్నైలోని నేసపాక్కం శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ ప్రముఖుల అశ్రు నయనాల మధ్య పూర్తయ్యాయి. భారతీయ సినిమాకు దశాబ్దాల పాటు విశేష సేవలందించిన

3లో..



# 2029 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు కుటుంబంతో కలిసి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని, ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చంద్రబాబు తెలిపారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగానే మరో 3 లక్షల ఇళ్లను, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లను మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అంగీకరించారని చెప్పారు. మొత్తంగా 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి మంజూరు చేసేందుకు కేంద్రం సహకరిస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

### బుర్రిపాలెంలో రూ.14 కోట్లతో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్లు

పేదలకు సొంత ఇల్లు ఇవ్వాలన్న ఆలోచనకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. 3 లక్షల ఇళ్ల నిర్మాణం అంటే కేవలం ఇళ్ల నిర్మించడమే కాదని, 3 లక్షల కుటుంబాల జీవితాల్లో మార్పునకు శ్రీకారం చుట్టే కార్యక్రమమని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు వేసిన ఓటుతో సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ చేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని చెప్పారు. గృహ నిర్మాణ రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు బుర్రిపాలెంలో రూ.14 కోట్లతో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా 177 ఇళ్ల నిర్మాణానికి చేపట్టిన పైలట్ ప్రాజెక్టును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి సీఎం సందర్శించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు గురించి అధికారులు వివరించారు. 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో పటిష్టమైన ఇళ్లను నిర్మించవచ్చని అధికారులు వివరించారు. ఈ సాంకేతికతతో నిర్మించే ఇళ్లలో బయట వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్టు సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### పేదలకు రూ.52 వేల కోట్ల విలువైన స్థలాలు

పేదలకు పట్టాభిషేకంలో భాగంగా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి పేదలకు నివాస స్థలాలు అందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి సహా వివిధ ప్రాంతాల్లో రూ.52 వేల కోట్ల విలువైన స్థలాలను పేదలకు అందించామని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ అజెండా అని స్పష్టం చేశారు. గత పాలనలో గృహ నిర్మాణ కార్యక్రమం పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని సీఎం విమర్శించారు. 2019--24 మధ్య 6 లక్షల పేదల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని చెరువులు, గుట్టల్లో ఇంటి స్థలాలు ఇచ్చారని ఆరోపించారు. దాదాపు 4 లక్షల మంది ఆ స్థలాలను వద్దంటూ వెనక్కి ఇచ్చేశారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ పేదలకు పక్కా ఇళ్లను నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి పోలవరం పూర్తయ్యేలోగా గోదావరి నీటిని వినియోగించుకున్నామని సీఎం చెప్పారు. ఎల్‌నినో వంటి తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లోనూ కృష్ణా డెల్టాకు గోదావరి నీటిని తరలించి పంటలను కాపాడగలిగామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటి సమస్య లేకుండా చేస్తామని అన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అంకురార్పణ చేశామని, రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన ఫలాల ఉత్పత్తి కేంద్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

### షైనింగ్ ఆంధ్రా- అచీవింగ్ ఆంధ్రా : శివరాజ్ సింగ్ చౌహాన్

విజనరీ నేత చంద్రబాబు నేతృత్వంలో ఏపీ ఇక షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రాగా మారుతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్ప బలం గొప్పదని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో ఏపీలో చేపడుతున్న గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చేపట్టిన 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగానే మరో 3 లక్షల ఇళ్లకు శాంక్షన్ ఇస్తామని, ఆ తర్వాత మరో 3 లక్షల ఇళ్లను కూడా ఏపీకి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రైతుల కోసం కేంద్రంతో కలిసి ఏపీ సీఎం అన్నదాత సుఖీభవ కింద రూ.20వేల ఆర్థిక సహకారం అందిస్తున్నారని అన్నారు. ఏపీలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు మొత్తం సుఖీభవ అనే విధానంలో ఏపీలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు. వీబీజీ రామ్ జీ పథకంతో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో డ్రెయిన్లు, రోడ్లు సహా వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం సహకారం అందిస్తుందన్నారు. ఏపీని 360 డిగ్రీల కోణంలో సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ పరిశీలన

అంతకుముందు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టును సందర్శించారు. సీబీఆర్ఐ అధికారులు వారికి త్రీడీ టెక్నాలజీ నిర్మాణ ప్రక్రియ గురించి వివరించారు. కేవలం 10 రోజుల్లో ఒక ఇంటిని ఈ సాంకేతికతతో నిర్మించే అవకాశముందని తెలిపారు. అనంతరం ఇరువురు నేతలూ ఓ లబ్దిదారు కుటుంబానికి చెందిన ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూమి పూజ చేసిన అనంతరం లబ్దిదారు కుటుంబంతో ఆప్యాయంగా మాట్లాడి వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి సూచికగా శిలాఫలకం ఆవిష్కరించి అక్కడికి సమీపంలోనే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం వేదికపై లక్ష్మీ అనే మహిళకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇంటి పట్టాన అందించారు.

## కరవు పరిస్థితులు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది

రివ్యూ చేసి పరిస్థితిని తెలుసుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. కృష్ణ జలాలు కుప్పం వరకు తరలిపోతున్నాయని పాలమూరుకు నీళ్లు రావడం లేదని, సీఎం చంద్రబాబుకు నీళ్లను బహుమతిగా ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రైతులకు విద్యుత్ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఇక ఖైరతాబాద్ సహా రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చిన సరే తాము పోటీ చేస్తామని స్పష్టం చేశారు."రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కరువు పరిస్థితులు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. అన్ని జిల్లాల్లో కరువు తాండవం చేస్తోంది. భూగర్భ జలాలు కొన్ని చోట్ల 20 మీటర్ల లోతుకు పడిపోయాయి. చాలా చోట్ల రైతన్నలు తమ పంటలు కాల్చుకుంటున్న పరిస్థితి చూస్తున్నాం. జులైలో 1 శాతం తక్కువ వర్షపాతం నమోదైతే ఆగస్ట్ లో 38, సెప్టెంబర్ 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని ఆరు నెలల ముందే ప్రపంచానికి సైంటిస్టులు హెచ్చరించారు. కానీ ఈ ప్రభుత్వం ఏనాడు కనీసం రివ్యూ చేసి పరిస్థితిని తెలుసుకున్న పాపాన పోలేదు" అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు.నీటి పారుదల, అగ్రికల్చర్, పవర్ మినిస్ట్రీలతో ముఖ్యమంత్రి సమీక్ష చేయాల్సింది పోయి పట్టించుకోలేదు. నాగార్జున సాగర్ కు పోయి వరుణయాగం చేసి దేవుడు వానలు కురిపిస్తే కురిపించినట్లు లేకుంటే మీ ఖర్మ అన్నట్లు వదిలేశారు. రాష్ట్రంలో ఇప్పటికీ కోటి 20 లక్షల ఎకరాల పంట ఉంది. నవంబర్ వరకు ఆ పంటలకు సంపూర్ణంగా కరెంట్ ఇస్తేనే ఆ పంటలు బతుకుతాయి. కరెంట్ ఉంటేనే బోర్ల ద్వారా రైతులు పంటలను కాపాడుకునే పరిస్థితి ఉంది. కానీ రాష్ట్రంలో ఏ ఊళ్లో కూడా 6 నుంచి 7 గంటలు కూడా కరెంట్ రావటం లేదు. ముఖ్యమంత్రి సొంతూరు కొండారెడ్డి పల్లిలో కూడా 7 గంటలు కరెంట్ వస్తలేదు. మీరు అడుక్కుంటారో, కొనుక్కుంటారో మాకు తెలియదు. రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు.మొన్న జరిగిన కేబినెట్ మీటింగ్ తర్వాత కరువు మండలాలను ప్రకటిస్తారని భావించాం. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ లు కరవు మండలాలను ఇప్పటికే ప్రకటించాయి. కరువు మండలాలను ప్రకటిస్తే కేంద్రం నుంచి మనకు సాయం అందే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పుడు ప్రభుత్వం కరువు ఉందని చెబితే కేంద్రం నుంచి వచ్చే బృందాలు విజిట్ చేసి సాయం చేయటం కష్టమైన పని. కనీసం కరువు మండలాలను కూడా గుర్తించలేని అచేతన స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. రైతులను, పంటలను ఆదుకునేందుకు కచ్చితంగా కేబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలి. కరువుతో అల్లాడుతున్న మహారాష్ట్ర సహా దక్షిణాది రాష్ట్రాలను ఆదుకోవాలని ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేస్తున్నా. ఈ సమయంలో మీరు సాయం చేయకపోతే కచ్చితంగా ప్రజలు మిమ్మల్ని క్షమించరు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్రం రూపాయి కూడా ఎక్కువ సాయం చేయలేదు. ఇప్పుడైనా తెలంగాణను ఆదుకోండి అని కవిత కీలక విజ్ఞప్తి చేశారు.చాలా రాష్ట్రాల్లో అధికంగా కరెంట్ ఉత్పత్తి జరుగుతోంది. ఆ కరెంట్ ను దక్షిణాది రాష్ట్రాలకు ఉచితంగా ఇవ్వండి. మా ముఖ్యమంత్రి వరుణయాగం అంటూ రాష్ట్రాన్ని అచేతన స్థితిలో పెట్టారు. మీరైనా ఆదుకోండి. కరెంట్ సప్లయ్ లేకపోవటం కారణంగా కూరగాయలు సహా అన్ని నిత్యావసరాల వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. మేము గతంలోనే సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన అప్పు కట్టకపోవటంతో కరెంట్ సప్లయ్ ఇబ్బంది అవుతుందని చెప్పాం. ఇప్పుడు సింగరేణి కరెంట్ ను వేరే రాష్ట్రాలకు అమ్ముతోంది. అప్పుడే బకాయిలు చెల్లించి ఉంటే ఇవ్వాళ ఈ పరిస్థితి ఉండేది కాదు. గతంలో మేము చెప్పిన అన్ని అంశాలను బేరీజు వేసి చూస్తే ఈ ప్రభుత్వం ఎంత అసమర్థ ప్రభుత్వమో అర్థమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే 60 శాతం మంది రైతులు ఆగమయ్యే పరిస్థితి ఉందని కవిత తెలిపారు.ఎండలు కూడా విపరీతంగా పెరిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేయాలి. ముఖ్యంగా కరువును ఎదుర్కొనేందుకు రైతుల సమస్యలు తీర్చేందుకు ప్రత్యేక కేబినెట్ సమావేశం పెట్టాలి. ఈ సమస్య ఇక్కడితోనే అయిపోదు. తాగునీటి సమస్య కూడా వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే అన్ని రిజర్వాయర్లలో డెడ్ స్టోరేజీ పరిస్థితి ఉంది. కనీసం కృష్ణాజలాలను కాపాడుకునేందుకు కూడా ఈ ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోలేదు. మన నీళ్లను మహబూబ్ నగర్ నుంచి కుప్పం తరలిస్తున్న ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. నార్లపూర్ రిజర్వాయర్ కు కొంత ఖర్చు చేసి ఉంటే ఇప్పుడు గ్రౌండ్ వాటర్ ఉండేది. కల్వకుర్తి పూర్తి కెపాసిటీ తో నీళ్లను నింపుకునే పరిస్థితి ఉండేది. కానీ మూడేళ్లలో ఆ చిన్న పని కూడా చేయలేకపోయారు. కానీ ఇప్పుడు కర్ణాటకను అడిగి నీళ్లు తెస్తున్నామని బిల్డప్ ఇస్తున్నారు. ఓ పక్క బిల్డప్ లు ఇస్తూనే మరోపక్క చంద్రబాబు కు నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి పంపిస్తున్నారు అని కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలకముందడుగు

శిలల మండలాన్ని (షియర్ జోన్) జాగ్రత్తగా దాటడంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైందన్నారు. అదనపు యంత్రాలను రంగంలోకి దించి, తవ్విన రాళ్లు, మట్టిని బయటకు తరలించే వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో వేగంతోపాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అమలుపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి ఆదివారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, అదనపు యంత్రాల వినియోగంపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతంలోని మెట్ట ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీటిని అందించి, ఏళ్ల తరబడి వేధిస్తున్న నీటి కొరతను తీర్చాలన్నదే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**ఐదారు నెలల్లో సుమారు 700 మీటర్ల పురోగతి** 2028 జూన్ నాటికి నీటిని అందించేందుకు పక్కా కార్యాచరణ రూపొందించి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఐదారు నెలల్లో 700 మీటర్లు గడిచిన ఐదారు నెలల్లో సొరంగం తవ్వకాలు సుమారు 700 మీటర్లు ముందుకు సాగినట్లు ప్రాజెక్టు బృందం మంత్రికి వివరించింది. అవుట్‌లెట్ వైపు సుమారు 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు 250 మీటర్ల మేర పురోగతి నమోదైందని తెలిపింది. తీవ్రమైన భూగర్భ, సాంకేతిక సమస్యలతోపాటు యంత్రాలు, తవ్విన పదార్థాల రవాణాలో ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఈ పురోగతి సాధించినట్లు పేర్కొంది. మొత్తం 43.968 కిలోమీటర్ల ప్రధాన సొరంగం పనులు సుమారు 79 శాతం పూర్తయ్యాయని, మరో 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు మిగిలి ఉన్నాయని వివరించింది. అత్యంత ప్రమాదకరమైన షియర్ జోన్‌ను దాటడం ప్రాజెక్టులో ముఖ్యమైన ముందడుగని ఉత్తమ్ పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిన అధికారులు, కార్మికుల కృషిని అభినందించారు. ఈ పురోగతిని కొనసాగిస్తూ సొరంగంలో 20 కిలోమీటర్లకు పైగా లోపల పనిచేస్తున్న సిబ్బంది భద్రతను కాపాడేందుకు అధికారులు, గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

**జాగ్రత్తగా సాగిన తవ్వకాలు** సొరంగం పనులకు నేతృత్వం వహిస్తున్న భారత సైన్యానికి చెందిన సొరంగ నిర్మాణ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఇన్‌లెట్ వద్ద ఎదురైన పరిస్థితులను వివరించారు. బలహీనమైన నేల, రాళ్లు ఒక్కసారిగా విరిగిపడే రాక్ బర్స్ట్ వంటి ప్రమాదకర పరిస్థితుల కారణంగా మరో ప్రమాదం జరగకుండా తొలి నెలల్లో తవ్వకాల వేగాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్లు తెలిపారు.టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) చిక్కుకుపోయిన ప్రాంతాన్ని చుట్టి వెళ్లేలా చేపట్టిన మళ్లింపు తవ్వకాల్లో మరింత బలహీనమైన శిలల మండలం ఎదురైందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రాంతాన్ని సురక్షితంగా దాటేందుకు 140 మిల్లీమీటర్ల సీమ్‌లెస్ పైపులతో తవ్వకాలు జరిగే భాగానికి ముందుగా గొడుగు మాదిరి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బలమైన రిబ్‌లను అమర్చడం, దశలవారీగా తవ్వడం, ముందున్న శిలల పరిస్థితిని తెలుసుకునేందుకు పరీక్షా డ్రిల్లింగ్ చేయడం, అదనపు రక్షణ ఏర్పాట్లతో ప్రమాదాలను నియంత్రిస్తూ ముందుకు సాగినట్లు చెప్పారు. ప్రస్తుతం శిలల పరిస్థితి మెరుగుపడుతుండటంతో సాధారణంగా పనులు సాగించే అవకాశం ఏర్పడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**యంత్రాలతో వేగం పెంపు** ప్రస్తుతం రెండు వైపులా కలిపి రోజుకు సుమారు ఎనిమిది మీటర్ల మేర పురోగతి నమోదవుతోందని ప్రాజెక్టు బృందం తెలిపింది.

నిరంతరంగా సాధిస్తున్న పురోగతి రోజుకు ఏడు నుంచి ఏడున్నర మీటర్లుగా ఉందని, ఒకట్రెండు రోజుల్లో పది మీటర్లకు కూడా చేరిందని వివరించింది. అవుట్‌లెట్ వద్ద మూడు డ్రిల్లింగ్ భుజాలున్న బూమర్ యంత్రం ఇప్పటికే పనిచేస్తోందని, అక్కడ పనులు అవసరమైన వేగానికి చేరువలో ఉన్నాయని తెలిపింది. ఇన్‌లెట్ వద్ద కూడా ఇదే తరహా మరో యంత్రం అక్టోబరులో అందుబాటులోకి రానుందని పేర్కొంది.

విద్యుత్‌తో నడిచే లోడర్లు, అధునాతన ఎక్స్‌కవేటర్లను కూడా పనుల్లో వినియోగిస్తున్నట్లు వివరించింది.జర్మనీ నుంచి తెప్పిస్తున్న రైలు ఇంజిన్ (లోకోమోటివ్) అక్టోబర్ నెలాఖరుకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని వినియోగంతో తవ్విన రాళ్లు, మట్టిని వేగంగా బయటకు తరలించవచ్చని, తద్వారా ఒక్కో దఫా పనికి పట్టే సమయం తగ్గుతుందని వివరించారు. సొరంగంలో 21 కిలోమీటర్ల వరకు దూరం నుంచి తవ్విన పదార్థాలను తరలించాల్సి రావడం ప్రధాన అవరోధంగా ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.తరలింపు ఆలస్యమైతే రాళ్లు, మట్టి లోపల పేరుకుపోయి, వాటిని తొలగించే వరకు తవ్వకాలు నిలిపివేయాల్సి వస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

**2028 మే-జూన్‌లో ప్రధాన సొరంగం అనుసంధానం లక్ష్యం** టన్నెల్-1లో రెండు వైపుల నుంచి సాగుతున్న తవ్వకాలు 2028 మే-జూన్ నాటికి కలిసే దశకు చేరుకుంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తవ్వకాలతోపాటే సొరంగం లోపలి గోడలను బలపరిచే స్ప్రే లైనింగ్ పనులు చేపడుతున్నారని, దీంతో సొరంగం అనుసంధానం పూర్తయ్యేలోపే లైనింగ్‌లో అధిక భాగాన్ని పూర్తి చేసే అవకాశం ఉందని సమీక్షలో వివరించారు.ప్రధాన సొరంగంతోపాటు టన్నెల్--2, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఇతర అనుబంధ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. వీటిలో ఏ పని అసంపూర్తిగా ఉన్నా నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. సుమారు 7.1 కిలోమీటర్ల పొడవున్న టన్నెల్-2లో సుదీర్ఘ విరామం తర్వాత లైనింగ్ పనులు తిరిగి ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో ఎంపీలు కె. రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కె. జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, అనిల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్; నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్; ఇంజినీర్ ఇన్ చీఫ్ ఓ.వి. రమేష్‌బాబు, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు..

నమోదుపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందని కాంగ్రెస్ గుర్తించింది. రెండు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 7 లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. కొత్తగా డిగ్రీలు పూర్తి చేసిన యువతను, ఉద్యోగార్థులను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఓటర్లుగా చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది.

### బీఆర్ఎస్ బలంపై ప్రత్యేక దృష్టి

ముఖ్యంగా హైదరాబాద్-రంగారెడ్డి ప్రాంతంపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టింది. జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్‌కు ఉన్న పట్టును దృష్టిలో ఉంచుకుని పట్టభద్రుల ఓటర్లను తమవైపు తిప్పుకునే వ్యూహాలను సిద్ధం చేస్తోంది. నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రతిపక్షాలు ఎన్నికల అస్త్రంగా మలిచే అవకాశం ఉండటంతో ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, నోటిఫికేషన్లు, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని భావిస్తోంది.

### సామాజిక సమీకరణాలా.. వ్యక్తిగత ఇమేజ్‌నా?

రెండు స్థానాల్లోనూ ఒకే సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులను నిలబెట్టడంపై బీఆర్ఎస్ సహా ప్రతిపక్షాలు కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే అవకాశం ఉంది. అయితే కేవలం సామాజిక సమీకరణాలతోనే ఎన్నికల ఫలితాలు నిర్ణయించబడవని, పట్టభద్రుల్లో అభ్యర్థుల వ్యక్తిగత ఆదరణ, సంస్థాగత బలం, ఓటర్లను పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్లే యంత్రాంగమే కీలకమని కాంగ్రెస్ భావిస్తోంది. ముందస్తు అభ్యర్థుల ప్రకటనతో ప్రచారంలో ముందంజ వేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఓటర్ల నమోదుతో పాటు బూత్‌స్థాయి వ్యూహాన్ని ఎంత సమర్థంగా అమలు చేస్తుందన్నదే అసలు పరీక్షగా మారింది.

## రోడ్డెక్కిన ఠాక్రే బ్రదర్స్

గమనార్హం. పాల్గొన్న నాయకులు, వేలాది మంది కార్యకర్తలు కేవలం మువ్వన్నెల జాతీయ పతాకాన్ని మాత్రమే చేతబూని నిరసనల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్‌సీపీ అగ్రనేతలు కూడా ఈ ర్యాలీలో పాల్గొని ఉద్ధవ్, రాజ్‌లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

### ఢిల్లీలోనూ రేగిన కాక

ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత లోపించిందని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు ముప్పు వాటిల్లుతోందని ఆరోపిస్తూ దేశ రాజధాని ఢిల్లీలోనూ నిరసనలు మిన్నంటాయి. జంతర్ మంతర్ వైపు మార్చ్ నిర్వహించేందుకు యత్నించిన సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాతో పాటు దాదాపు 150 మంది ప్రతిపక్ష, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియా గేట్ వద్ద ధర్నా నిర్వహించి ఎన్నికల సంఘం వైఖరిని ఎండగట్టారు.

### దేశవ్యాప్తంగా సార్వత్రిక నిరసనలు

ఎన్నికల వ్యవస్థపై ప్రజాస్వామ్యవాదుల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, ఓటర్ల ముసాయిదా జాబితాలో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేర్పులు చేశారనేది ఆందోళనకారుల ప్రధాన ఆరోపణ. ముంబై, ఢిల్లీలతో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ప్రజాసంఘాలు, పౌర సమాజం వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలోనే ముంబైలోని శివాజీ పార్క్ వద్ద 'జైల్ భరో' కార్యక్రమాలు కూడా జరిగాయి. సీఈసీ తన పదవి నుంచి తప్పుకునే వరకు ఈ పోరాటాన్ని ఆపేది లేదని ప్రతిపక్ష నాయకులు స్పష్టం చేస్తున్నారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ అరాచకాలు.?

ఎలాంటి కారణం పేర్కొనలేదని తాజాగా ఓ అధ్యయనం బయటపెట్టింది.తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా వ్యత్యాసాలు ఉన్నాయంటూ ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై సబర్ ఇన్‌స్టిట్యూట్ , కాన్‌స్టిట్యూషనల్ గార్డియన్స్ ఫోరమ్ ఎన్నికల డేటా విశ్లేషణ నిర్వహించాయి. ఇందులో 2,01,249 మంది ఓటర్లకు జారీ చేసిన నోటీసులలో వ్యత్యాసానికి గల కారణం ఏదీ చెప్పకుండా నోటీసులో ఖాళీగా వదిలేసినట్లు తేలింది. ఇందులో రాష్ట్రంలో మొత్తం 92.85 లక్షల వ్యత్యాస నోటీసులను పరిశీలించారు.

వీటిలో అత్యధిక సంఖ్యలో గత ఎస్ఐఆర్ తో అనుసంధానించబడనివే ఉన్నాయి. ఇలాంటివి 32.37 లక్షల నోటీసులు ఉండగా.. మరో 25.97 లక్షల నోటీసులు తల్లిదండ్రుల పేర్లలోని వ్యత్యాసాలకు సంబంధించినవి ఉన్నాయి. ఓటర్ల సొంత పేర్లలోని వ్యత్యాసాలకు సంబంధించి మరో 11.14 లక్షల నోటీసులు జారీ అయ్యాయి.హైదరాబాద్ సరిహద్దు నియోజకవర్గాలైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లలో 66.6% మందికి నోటీసులు అందగా, ఆ తర్వాతి స్థానాల్లో కూకట్‌పల్లి (65.4%), ఉప్పల్ (57%), మేడ్చల్ (56%), శేరిలింగంపల్లి (55.8%) ఉన్నాయి. అలాగే ముస్లిం ఓటర్లకు సంబంధించిన నోటీసులు 14.16% (అంటే 13.14 లక్షలు) ఉన్నాయి. బహదూర్‌పుర, చంద్రాయణగుట్ట, కార్వాన్ , యాకుత్‌పుర వంటి హైదరాబాద్‌లోని నియోజకవర్గాల్లో వీరి వాటా ఎక్కువగా ఉంది.

బహదూర్‌పురలో నోటీసులలో ముస్లింల పేర్లు 85.18% ఉండగా, చంద్రాయణగుట్టలో 71.15%, కార్వాన్‌లో 54.56%, యాకుత్‌పురలో 61.16% ఉన్నాయి. ఈ నోటీసులలో పేర్కొన్న కారణాలు భిన్నంగా ఉన్నాయి. గత ఎస్ఐఆర్ తో లింక్ కాని ఓటర్లు, తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు, సొంత పేర్లలో వ్యత్యాసాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసాలు, సోదరులు, సోదరీమణుల మధ్య తొమ్మిది నెలల కంటే తక్కువ వయస్సు అంతరం ఉండటం వంటి కారణాలున్నాయి. ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న సందర్భాల్లో కూడా నోటీసులు జారీ చేశారు. ఈ విభాగంలో జారీ అయిన నోటీసులలో 50.5% ముస్లిం పేర్లకు సంబంధించినవే ఉన్నాయని న్యూస్ మినిట్ పేర్కొంది.

## ప్రజల ఆశలు నెరవేర్చడం చంద్రబాబు ద్వారానే సాధ్యం

శివరాజ్ సింగ్ గుర్తుచేశారు. "ఆయన దూరదృష్టితోనే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. అమరావతి అభివృద్ధిపై ఆయన విజన్ చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆయన నిబద్ధత, కఠోర శ్రమతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఐకాన్‌గా నిలుస్తుంది" అని చౌహాన్ పేర్కొన్నారు.

### జగన్ పాలనలో సర్వనాశనం

గత ఐదేళ్లలో జగన్ తన విధ్వంసకర వైఖరితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చౌహాన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రధాని నరేంద్ర మోదీ పేదల ఇళ్ల కోసం నిధులు పంపితే, జగన్ ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండా ఆ పథకాన్ని నీరుగార్చింది. పేదల సొంతింటి కలను చిదిమేసింది. కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించి పాపం చేసింది. జగన్‌ను ఏపీ ప్రజలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే, ఈపాటికే పేదలందరికీ ఇళ్లు ఉండేవని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని రాజధాని లేకుండా వదిలేస్తే, జగన్ మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు.

### పేదలందరికీ పక్కా ఇళ్లు.. కేంద్రం భరోసా

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు కట్టించాలని సంకల్పించారని శివరాజ్ సింగ్ తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రానికి 76,000 ఇళ్లు మాత్రమే వస్తాయని అధికారులు చెప్పారు. కానీ చంద్రబాబు గారు అందరికీ ఇళ్లు కావాలని, ఇంకా ఎక్కువ కేటాయించాలని ప్రధాని మోదీని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు తొలి విడతగా 3 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఇవాళ బాబు గారు ఇవి కూడా చాలవు, మరో 6 లక్షల ఇళ్లు కావాలని అడిగారు. తప్పకుండా ఇస్తాం. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ 3 లక్షలు, ఆ తర్వాత మరో 3 లక్షలు ఇచ్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను ప్రధాని మోదీ ఆశీస్సులతో, చంద్రబాబు నాయకత్వంలో నెరవేరుస్తాం" అని హామీ ఇచ్చారు. బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించడం దేశానికే ఆదర్శమని, ఇది సమయాన్ని, ఖర్చును తగ్గిస్తుందని ప్రశంసించారు.

### మోదీ-బాబు నాయకత్వంలో 360 డిగ్రీల అభివృద్ధి

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చేస్తున్నారని చౌహాన్ అన్నారు.

"మోదీ, బాబు అంటే ఒకటి ం ఒకటి = రెండు కాదు.. ఒకటి ం ఒకటి = పదకొండు. వారితో పవన్ కల్యాణ్ కూడా తోడయ్యారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తారు. అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేశాం. రాష్ట్రానికి రూ. 15,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాం. జగన్ సర్కారు పక్కన పెట్టిన పోలవరం ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు.

### మహిళలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్రంలోని ఏ సోదరి పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 23 లక్షలుగా ఉన్న లఖ్‌పతి దీదీల సంఖ్యను 60 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే 'సరస్ మేళా'ను తొలిసారిగా ఢిల్లీ నుంచి బయటకు తీసుకొచ్చి, అక్టోబర్ 15న విజయవాడలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఇది మహిళల పాలిట కుంభమేళా అవుతుందన్నారు.

రైతుల కోసం కేంద్రం ఇస్తున్న రూ. 6,000కు అదనంగా, చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' కింద మరో రూ. 14,000 కలిపి మొత్తం రూ. 20,000 అందించి రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు."చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఇక సర్వైవింగ్ స్టేట్ కాదు, షైనింగ్ స్టేట్‌గా మారింది. ఆస్పిరేషనల్ ఆంధ్ర, యాంబిషియస్ ఆంధ్ర, ఆసమ్ ఆంధ్రగా రూపుదిద్దుకుంటోంది. ప్రతి ఒక్కరి కలలను నెరవేర్చే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది" అని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగాన్ని ముగించారు.

## తెలంగాణకు బీసీ సీఎం అవుతారు

ధైర్యం, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పార్టీ ఒక కులానికో ఒక ప్రాంతానికో, ఒక వ్యక్తికో పరిమితమైన పార్టీ కాదు కాంగ్రెస్ పార్టీ ఓబీసీలను అక్కున చేర్చుకుంటుంది కాబట్టి అగ్రవర్ణాలు కూడా మద్దతు ఇస్తారనడానికి ఇక్కడ ఉన్న నాయకులే నిదర్శనం అన్ని కులాల మద్దతుతోనే మాకు రావాల్సిన వాటా తీసుకుంటాం అవసరమైతే లాక్కుంటాం" అని మహేష్ కుమార్ గౌడ అన్నారు.

రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి సాకారం చేశారని అన్నారు. "పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డిలాగే బీసీలకు న్యాయం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం పెట్టి, ఆమోదించి కేంద్రానికి పంపాం, అసెంబ్లీలో బీజేపీ మద్దతు ఇచ్చింది కానీ, రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు, వాళ్లు ప్రధాని మోదీ, అమిత్ షాలకు దగ్గరకు వెళ్లి తెలంగాణ ప్రభుత్వం ఓ గొప్ప కార్యక్రమం చేసింది కుల సర్వే దీనిని ఆమోదించండి అని చెప్పే ధైర్యం వీరికి లేదు. బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు ఇచ్చాయి కానీ, కేంద్రం ఆమోదించి ఉంటే యావత్తు దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండేది" అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# పులి మాటువేసింది..
# నెమలి జింకను కాపాడింది..



ప్రకృతిలో వన్యప్రాణులు మనుగడ సాధించాలంటే తమ శుత్రువుల కదలికలను గమనించుకుంటూ జీవన పోరాటం సాగించాల్సిందే. ప్రత్యేకించి వన్యమృగాలు తమ ఆకలి తీర్చుకునేందుకు మాటు వేసి ఇతర జీవులను చంపుతుంటాయి. ఈ క్రమంలో వన్యమృగాలకు బలికాకుండా ఇతర జంతువులు అప్రమత్తంగా ఉంటాయి.. అలాంటి వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.పులి తన చాకచక్యంతో జింకను చంపి తినాలనుకుంది. అయితే ప్రాణాలు దక్కాలని రాసి పెట్టి ఉంటే ఏ రూపంలోనైనా మృత్యువు నుంచి తప్పించుకునే మార్గం దొరుకుతుంది. ఈ జింకకు కూడా అలానే రాసి పెట్టిఉన్నట్టుంది..ఆ జింకకు ఇంకా భూమి మీద నూకలు బాకి ఉన్నాయి. అనుకోని అతిథి ఆ జింక ప్రాణాలు కాపాడింది. ఇంతకీ ఎవరా గెస్ట్ అనుకుంటున్నారా..? నెమలి. జింక నీళ్లు తాగేందుకు ఓ కొలను దగ్గరకు వచ్చింది. ఈ క్రమంలో జింకను చూసిన పులి సైలెంట్‌గా చెట్టు చాటున మాటువేసి జింకను అదిమిపట్టేందుకు వేచి చూస్తోంది. న్ని క్షణాల్లోనే జింకపై దాడి చేయాలనుకునేలోపే నెమలి అరుపులు వినిపించాయి. ఆ అరుపులు విన్న జింక వెనుకాల ఏదో ప్రమాదం పొంచి ఉందని గ్రహించి చెంగుచెంగున పరుగులు పెట్టింది. ఇంతలోనే పులి కూడా దాన్ని వెంబడించి పట్టుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. జింక తుర్రున పోదొల్లోకి వెళ్లిపోయి తన ప్రాణాలు కాపాడుకుంది. నెమలి జింక ప్రాణాలు కాపాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

# ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో
# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఖమ్మం రూరల్: ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మున్నేటి సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం కలకలం రేపింది. మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు సమీపంలోని మున్నేరు కాలువ చెక్ డ్యామ్ వద్ద అమృతదేహం సమీప ప్రాంతవాసుల కంటపడింది. దీంతో వారు పోలీసులకు ససమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు చనిపోయిన మృతుడి వివరాలు, చావుకు గల కారణాలు, హత్యనా, ఆత్మహత్యనా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఖమ్మం నగర పరిధిలోని ఖానాపురంలో నివాసం ఉంటున్నట్టు ఇతని పూర్వం ఏన్కూరు మండలానికి చెందిన వాడుగా కొంత ప్రచారం జరుగుతుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం..
# తెలంగాణ మహిళ దుర్మరణం..!



అమెరికా లో జరిగిన రోడ్డు ప్రమాదం లో తెలంగాణకు చెందిన ఓ మహిళ మృతిచెందారు. ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో ఘోరం జరిగిపోయింది. ఆ కారులో ఉన్న తెలంగాణ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరణించిన మహిళను మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన దారం సుప్రియ గా గుర్తించారు. ఈ ఘటనతో సుప్రియ కుటుంబంలో, మహబూబాబాద్ పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.వివరాల్లోకి వెళ్తే.. ఉద్యోగరీత్యా అమెరికాలోని మిస్సోరిలో నివసిస్తున్న 31 ఏళ్ల సుప్రియ.. ఇవాళ తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) కారులో వెళ్తున్నారు. అదే సమయంలో వారి వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఒక ట్రక్కు కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుప్రియ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతోపాటు కారులో ఉన్న మరో భారతీయ యువతికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కాగా సుప్రియ భర్త కొడుమూరి రంజిత్, అత్తమామలు కొడుమూరి వెంకటేశ్వర్లు, రాధిక మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్నారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ఏర్పాట్లపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. సుప్రియ మరణ వార్త తెలియడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో
# కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## - పువ్వాడ అజయ్ కుమార్




భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని మూడో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో కీలకమైన యూనిట్ నిలిచిపోవడం ప్రభుత్వ విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యానికి, వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ యూనిట్ నిలిచిపోవడంతో రోజుకు 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగిందని ఇప్పటివరకు సుమారు 15.5 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగిందని పువ్వాడ ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కీలకమైన పరికరాల నిర్వహణ, ముందస్తు తనిఖీలు, స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన మూడో యూనిట్‌ను వెంటనే పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వేధింపులు..
## కరీంనగర్ జిల్లాలో సర్పంచ్ ఆత్మహత్యాయత్నం!



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండయ్యపల్లి సర్పంచ్ మల్యాల తిరుపతి అలియాస్ వినయ్ సాగర్ ఆత్మహత్యకు యత్నినంచారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గంగాధర మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు తనను అవమానాలకు గురిచేస్తున్నారని, తనపై అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం మధురానగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద క్రిమిసంహార మందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అడ్డుకుని ఆయనను ప్రైవేటు వాహనంలో కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తనపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. గంజాయి కేసు పెడతానంటూ బెదిరిస్తున్నారని, గంగాధర పోలీసులు ఫోన్ చేసి కేసు నమోదైందని, నోటీసులు తీసుకోవాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంగాధర మండల సర్పంచుల వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు తనను అవమానకరంగా మాట్లాడుతున్నారని తిరుపతి ఆరోపించారు. తన ఆత్మహత్యాయత్నానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గంగాధర మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# మెడికవర్ ఆస్పత్రిలో వరుస మరణాల కలకలం..
# రెండు రోజుల్లో 15 మంది మృత్యువాత




సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో వరుస మరణాలు కలకలం రేపుతున్నాయి. ఒక్క సెప్టెంబర్ 22న ఏడుగురు రోగులు మృతిచెందారని, రెండు రోజుల వ్యవధిలో మొత్తం 15 మంది ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 22న మెడికవర్ ఆస్పత్రిలో అక్తా తునిసా, జి. అరుణదేవి, చంద్రకళ, దుంపాల మాణిక్యమ్మ, కృష్ణ జంగయ్య, జి. మేరీ ఫాతిమా, అల్లాచెరువు వెంకటగిరి ప్రసాద్ అనే ఏడుగురు రోగులు మృతిచెందినట్లు సమాచారం.

### ఠాగూర్ సినిమా తరహాలో భారీగా వసూళ్లు?

ఠాగూర్ సినిమా తరహాలో అక్తా తునిసా అనే రోగికి సెప్టెంబర్ 21న బ్రెయిన్ డెడ్ అయినప్పటికీ.. చికిత్స పేరుతో ఆమె కుటుంబం నుంచి రూ.10 లక్షలు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆమె మృతిచెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారని పేర్కొంటున్నారు. చికిత్సకు తొలుత రూ.10 లక్షల ప్యాకేజీ మాట్లాడుకుని.. ఆ తర్వాత రూ.30 లక్షలు చెల్లిస్తేనే డిశ్చార్జ్ చేస్తామని చెప్పినట్లు మరికొందరు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై రోగుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చినవారి నుంచి భారీగా నగదు వసూలు చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. వరుస మరణాలు, చికిత్సకు సంబంధించిన వసూళ్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సింగీతంకు కన్నీటి వీడ్కోలు

ఓ మహోన్నత అధ్యాయం ఆయన మరణంతో ముగిసినట్లయింది. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సింగీతం శ్రీనివాసరావు (94), చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన భౌతికకాయాన్ని చెన్నై విరుగంబాక్కంలోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. సింగీతంతో ఎన్నో చారిత్రక చిత్రాల్లో పనిచేసిన విశ్వనటుడు కమల్ హాసన్, ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సింగీతం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింగీతం మరణం పట్ల భారతీయ సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు వంటి ఎందరో అగ్ర తారలు, సాంకేతిక నిపుణులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. భారతీయ సినిమాలో ప్రయోగాలకు, నూతన ఒరవడులకు సింగీతం శ్రీకారం చుట్టారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని కొనియాడారు.

# కేబీఆర్ పార్కు స్టీల్ బ్రిడ్జీల ప్రాజెక్టు రద్దు

ఏర్పడే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయంగా వన్‌వే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.నెల రోజుల క్రితం అమలు చేసిన వన్‌వే విధానంతో మొదట్లో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే ఒకట్రెండు రోజుల తర్వాత పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. మూడో రోజు నుంచి ప్రధాన సిగ్నళ్ల వద్ద ఎక్కువసేపు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా వాహనాలు సాఫీగా కదలడం ప్రారంభించాయి. దీంతో కేబీఆర్ పార్కు చుట్టుపక్కల ట్రాఫిక్ సమస్యను భారీ నిర్మాణాలు చేపట్టకుండానే పరిష్కరించే అవకాశం ఉందని అధికారులు భావించారు.ట్రాఫిక్ రద్దీ మెరుగుపడిన నేపథ్యంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు నిర్మించడం అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం రూపొందించిన రద్దు తీర్మానానికి శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన స్థాయీ సంఘం సమావేశంలో ఆమోదం లభించింది. పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ ప్రత్యేక అధికారి జయేశ్‌రంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పరిసరాలతో పాటు ఇతర కూడళ్లలో ప్రతిపాదించిన నిర్మాణాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆయా పనుల కోసం కేఎన్‌ఆర్, మేఘా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసేందుకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. దీంతో కేబీఆర్ పార్కు చుట్టూ భారీ నిర్మాణాలతో ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన పాత ప్రణాళికకు తెరపడింది.ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సీఎల్ కూడలి నుంచి జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ రోడ్డును, అంటే జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36ను కలుపుతూ ఆరు లైన్ల పైవంతెన నిర్మించనున్నారు. ఈ కారిడార్ సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు ఉండనుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని ముఫకంజా విద్యాసంస్థల సమీపంలో పైవంతెనపైకి ఎక్కే వాహనాలు నేరుగా జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ కిందకు చేరుకునేలా డిజైన్ రూపొందించనున్నారు. అదే విధంగా చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ వద్ద కారిడార్‌పైకి ఎక్కే వాహనాలు ముఫకంజా కాలేజీ ప్రాంతంలో దిగేలా ఏర్పాట్లు చేయనున్నారు.బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 వైపు వెళ్లే వాహనాల కోసం ఎలివేటెడ్ కారిడార్ నుంచి జలగం వెంగళరావు పార్కు వరకు ప్రత్యేక ర్యాంపును నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం డిజైన్ల రూపకల్పన పూర్తికావాల్సి ఉండటంతో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం, నిర్మాణ విధానం, ఇతర సాంకేతిక అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కేబీఆర్ పార్కు చుట్టూ ప్రతిపాదించిన పాత ప్రాజెక్టు రద్దు కావడంతో కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ బాధ్యతను జీహెచ్‌ఎంసీ మేఘా సంస్థకు అప్పగించింది. ఈ మార్పుతో భారీ స్థాయి కూడళ్ల అభివృద్ధికి బదులుగా ట్రాఫిక్ రద్దు వేగవంతం చేసే ప్రత్యామ్నాయ మౌలిక వసతులపై దృష్టి సారించినట్టైంది. ముఖ్యంగా పంజాగుట్ట-బంజారాహిల్స్-జూబ్లీ చెక్‌పోస్టు మార్గంలో సిగ్నల్ ఆధారిత ట్రాఫిక్‌ను తగ్గించి, వాహనాల నిరంతర రాకపోకలకు అనువైన కారిడార్ ఏర్పాటు చేయడమే కొత్త ప్రణాళిక ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై
# విజిలెన్స్ విచారణ

## -కేరళలో పాత కేసు రీఓపెన్



తిరువనంతపురం (ప్రశ్న న్యూస్) ప్రస్తుత భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తాజాగా విజిలెన్స్ విచారణకు కేరళ ప్రభుత్వం ఆదేశించింది. ఆయన గతంలో కేరళ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) సెక్రటరీగా పనిచేసిన సమయంలో వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఈ విచారణ జరగనుంది. కాంగ్రెస్ నేత మలయిన్‌కీళు వేణుగోపాల్ సమర్పించిన పిటిషన్ ఆధారంగా, రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితాల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు 2006 నాటిది. కేరళ రాష్ట్ర రవాణా ప్రాజెక్ట్ (కేఎస్‌టీపీ) కింద ఎంసీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగస్వామిగా ఉన్న పాటి-బెల్ కన్సార్టియం తరఫున పనిచేసిన మలేషియన్ సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్, కేరళ నుంచి తిరిగి వెళ్లాక 2006 నవంబర్‌లో కౌలాలంపూర్‌లో ఆత్మహత్య చేసుకున్నారు.

ఆయన రాశారని చెబుతున్న సూసైడ్ నోట్‌లో అప్పటి పీడబ్ల్యూడీ సెక్రటరీగా ఉన్న జ్ఞానేశ్ కుమార్ పేరు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలు జరిగాయని, ఈ కేసులో 2006లో జరిగిన ప్రాథమిక విజిలెన్స్ విచారణ బాహ్య ఒత్తిళ్ల కారణంగా పక్కదారి పట్టిందని వేణుగోపాల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన హోంమంత్రి రమేశ్ చెన్నితాల, నాటి విచారణకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ వెంటనే తమకు సమర్పించాలని 'విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో'ను (వీఏసీబీ) ఆదేశించారు. ఆనాటి దర్యాప్తు ఎలా జరిగిందీ, నిజంగానే ఏవైనా బయటి శక్తులు దానిని ప్రభావితం చేశాయా అనే కోణంలో ఈ ఫైళ్లను పరిశీలించనున్నారు.నాటి విచారణపై వచ్చిన జోక్యం ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్‌ను హోంమంత్రి ఆదేశించారు. అయితే, సూసైడ్ నోట్‌లో పేరు ప్రస్తావించినంత మాత్రాన లేదా తాజా విచారణకు ఆదేశించినంత మాత్రాన జ్ఞానేశ్ కుమార్ తప్పు చేసినట్లు నిర్ధారణ కాదని స్పష్టమవుతోంది. విజిలెన్స్ దర్యాప్తులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతానికి పాత రికార్డులను పరిశీలించి, జోక్యం ఆరోపణలపై దృష్టి సారించడం ఈ విచారణ ప్రధాన ఉద్దేశం.

# దశదినకర్మలకు బీఆర్ఎస్ పార్టీ బియ్యం వితరణ



కారేపల్లి, అక్టోబర్ 4: ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముందుకొచ్చారు. సింగరేణి మండలం మాదారం గ్రామానికి చెందిన మూడ్ లక్ష్మా దశదినకర్మల సందర్భంగా ఆదివారం పార్టీ గ్రామ, మండల కమిటీల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు.పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబానికి అవసరమైన సమయంలో చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. గ్రామంలో ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, అవసరమైన సందర్భాల్లో తమవంతు సహాయ సహకారాలు అందించడం సామాజిక బాధ్యతలో భాగమన్నారు. దశదినకర్మల నిర్వహణకు బియ్యం అందించడం ద్వారా కుటుంబానికి కొంతమేర అండగా నిలిచామని తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మనోధైర్యం కల్పించారు. పార్టీ నాయకులు సహాయం అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాదారం గ్రామ శాఖ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ అజ్మీర రవి, 8వ వార్డు సభ్యుడు పాయం మునేందర్, బర్మావత్ కోటి, బర్మావత్ వీరన్న, బర్మావత్ వంశీ, రవి, మాజీ వార్డు సభ్యుడు లాలు, మోతిలాల్, రమేశ్, మురళి, బిక్కు, శ్రీకాంత్, దేవా, భాను తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం..

### రెండు ఫర్నిచర్ షాపులు దగ్ధం

### రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం..

### మూడో దుకాణానికి మంటలు

### శామీర్‌పేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివప్రసాద్ వెల్లడి





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ చెక్‌పోస్ట్ పరిధిలో శనివారం అర్ధరాత్రి సుమారు 1:30 గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న ఫర్నిచర్ దుకాణాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రెండు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో స్పందించి మంటలను నియంత్రించడంతో పక్కనే ఉన్న మూడో దుకాణానికి ప్రమాదం విస్తరించకుండా నివారించగలిగారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను శామీర్‌పేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివప్రసాద్ వెల్లడించారు. బాధితుల ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని తెలిపారు. అయితే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, పూర్తిస్థాయి ఆస్తి నష్టం వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**అగ్ని భద్రతా చర్యలు తప్పనిసరి : శివప్రసాద్**

తాత్కాలిక షెడ్లలో అనుమతులు లేకుండా ఫర్నిచర్ దుకాణాలను ఏర్పాటు చేయడం, వాటిలో పరుపులు, ఫోమ్, గడ్డి తదితర త్వరగా మండే పదార్థాలను నిల్వ ఉంచడం వల్ల మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉంటుందని ఫైర్ ఆఫీసర్ శివప్రసాద్ తెలిపారు.

# రేగళ్ల భూములకు పట్టా హక్కులు కల్పించాలి

### కేటీపీఎస్, నవభారత్ సీఎస్ఆర్‌తో రేగళ్ల పెద్దతండా అభివృద్ధి చేయాలి

### గ్రామాన్ని దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధి చేపట్టాలని మంత్రి పొంగులేటికి

### సర్పంచ్ లావుడ్యా పూర్ణ నాయక్ వినతి





కొత్తగూడెం, అక్టోబర్ 4 (ప్రశ్న న్యూస్) లక్ష్మీదేవిపల్లి మండలం, రేగళ్ల పెద్దతండా పరిధిలో గిరిజన, పేద కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా భూ హక్కులు, పట్టాలు, భూ రికార్డుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు. రేగళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశంలో లావుడ్యా పూర్ణ మాట్లాడుతు అర్హులైన గిరిజన కుటుంబాలకు భూ హక్కులు కల్పించడంతో పాటు పోడు భూముల సమస్యలు, పట్టాల మంజూరు, భూ రికార్డుల సవరణ, భూముల సర్వే, హద్దుల నిర్ధారణ వంటి అంశాలను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ప్రత్యేక రెవెన్యూ సర్వే నిర్వహించి భూ సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి పరిష్కరించాలని, భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు, రుణాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేటీపీఎస్, నవభారత్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో రేగళ్ల పెద్దతండా గ్రామపంచాయతీని దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని, రేగళ్ల పెద్దతండా గ్రామపంచాయతీలో ప్రధానంగా గిరిజన కోయ, లంబాడ కుటుంబాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలు నివసిస్తున్నాయని, గ్రామం కేటీపీఎస్ విద్యుత్ కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్లు, నవభారత్ పరిశ్రమకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. పారిశ్రామిక కార్యకలాపాల కారణంగా ఫ్లైయాష్, దుమ్ము తదితర పర్యావరణ ప్రభావాలపై గ్రామ ప్రజల్లో ఆందోళనలు ఉన్నాయని తెలిపారు.

**మౌలిక వసతులు కల్పించాలి**

సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు, మందులు అందించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేపట్టడంతో పాటు ఫ్లైయాష్, దుమ్ము ప్రభావాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రజా సదుపాయాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఉమ్మడి రేగళ్ల పంచాయతీని స్పెషల్ డ్రైవ్ గా చేపట్టి 100 శాతం ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని, ఐటీడిఏ నుండి గిరిజన తండాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కేటీపీఎస్, నవభారత్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో రేగళ్ల పెద్దతండాకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ మంజూరు చేయడంతో పాటు గ్రామాన్ని దత్తత తీసుకునేలా సంబంధిత సంస్థలు, అధికారులతో సమన్వయం చేయాలని కోరారు. ఈ అంశాలను స్పష్టంగా తెలుపుతూ వినతి పత్రాన్ని మంత్రికి అందించారు. సర్పంచ్ వినతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే నిధులు మంజూరు చేసి గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అక్రమ కట్టడాలకు నిలయంగా మారిన మేడ్చల్

### - నిద్ర వస్త్థాలో టౌన్ ప్లానింగ్

### - ఇలాంటి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం చేపట్టిన నో యాక్షన్

### - టౌన్ ప్లానింగ్ అధికారులు జర పట్టించుకోండి సార్

మేడ్చల్(ప్రశ్న న్యూస్) అక్రమ నిర్మాణాలకు మేడ్చల్ నియోజకవర్గ అడ్డగా మారింది. మేడ్చల్ సర్కిల్ తో పాటు ఎల్లంపేటలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారా లేరా అనే అనుమానాలు కలుగుతున్నాయి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిని పట్టించుకునే పాపాన పోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి కందిపడుతున్న తనకు రావలసిన నెల వారి జీతం వచ్చిందా? లేదా? అని సంకల్పంతోనే టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారని విమర్శలు ఉన్నాయి. తాము తీసుకుంటున్న జీతానికైనా న్యాయం చేయాలన్న సంకల్పంతోనే పని చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**గుండ్ల పోచంపల్లి లో అక్రమ షెడ్డు నిర్మాణం...**

మేడ్చల్ సర్కిల్ గుడ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని బాసు రేగడి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డు నిర్మిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సమాధానం లేదు. కానీ నిర్మాణం మాత్రం సాగుతుంది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు నోరు విపకపోవడంపై అనుమానాలు విక్రమవుతున్నాయి. అక్రమంగా షెడ్డు నిర్మాణం సాగుతున్న దాన్ని అడ్డుకునే ప్రయత్నం మాత్రం టౌన్ ప్లానింగ్ అధికారులు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో పరిస్థితి ఇంకా ఘోరం**

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో పరిస్థితి ఇంకా ఘోరం. ఇక్కడ నోటీసులు ఇచ్చిన డోంట్ కేర్ అంటూ నిర్మాణాలు సాగిపోతున్నాయి. ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయానికి కూతబెట్టు దూరంలో కమర్షియల్ రూములు నిర్మించిన దిక్కు దివానా లేదు. జి ప్లస్ టు అనుమతులు పంది అదనంగా మరో రెండు అదనపు గదులు నిర్మించిన పట్టించుకునే నాధుడే లేడు. అసలు ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారా లేరా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

**ఎల్లంపేట...**

ఎల్లంపేటలో ఎల్లంపేట మున్సిపల్ కు కూత వేటు దూరంలో



కమర్షియల్ రూములు నిర్మిస్తున్న ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులు ముద్దు నిద్రలో ఉన్నారు. ఇలాంటి అనుమతులు లేకుండా కమర్షియల్ రూమ్ ల నిర్మాణ సాగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం తమకు ఏం పట్టనట్లుగా వ్యవహరించడం పై టౌన్ ప్లానింగ్ అధికారులపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**ఘనాపూర్ లో సైతం ఇదే దుస్థితి**

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఘనపూర్ లో పరిస్థితి ఇదే విధంగా ఉంది. జి ప్లస్ టు అనుమతులు పొంది జి ప్లస్ ఫైవ్ నిర్మాణాలు చేపట్టిన వాటిని అడ్డుకునే ప్రయత్నం టౌన్ ప్లానింగ్ అధికారులు చేయకపోవడంపై విమర్శలు వెలివెత్తుతున్నాయి. ఈ భవనానికి ఇదివరకే నోటీసులు సైతం అందజేశారు. అయినా నిర్మాణ పనులు సైతం జోరుగా అవుతున్నాయి.

**టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడమే ఇబ్బందులు**



ఎల్లంపేట మున్సిపాలిటీకి శాశ్వత టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతోనే పరిస్థితి దిగజారిపోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారికి ఇక్కడ ఇన్చార్జి బాధ్యతలు మాత్రమే ఉన్నాయి. వారంలో రెండు రోజులు మాత్రమే ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తారు. ఆ రెండు రోజులు తూతూ మంత్రంగా వచ్చి వెళ్లిపోవడమే తప్ప అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో జోరుగా అక్రమ నిర్మాణాల చదువుతున్న వాటిని అడ్డుకునే ప్రయత్నం టౌన్ ప్లానింగ్ అధికారులు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నెల నెల జీతం తీసుకునే టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా విధించాలని ఎల్లంపేట నగర వాసులు కోరుతున్నారు.

**పాలకవర్గం ఉన్న శూన్యం**

ఎల్లంపేట మున్సిపల్ లో పాలకవర్గం ఉన్న ఫలితం శూన్యం. ఇక్కడ పాలకవర్గ సభ్యులు ఉన్నారంటే ఉన్నారు అన్నట్లు తప్పుగా వారి ప్రభావం ఏమీ లేదు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టాలకు నోటీసులు ఇచ్చిన ఇక్కడ అక్రమ నిర్మాణదారులు భయపడడం లేదు అంటే వారికి రాజకీయ నేతల అండ ఉండడంతోనే వారు భయపడడం లేదన్న విమర్శలు వినిపిస్తుంది.

**పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారుల నియమించాలి**

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో పూర్తిస్థాయి పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారిని నియమిస్తే తప్ప అక్రమ నిర్మాణాలకు బ్రేక్ పడే అవకాశం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కొత్తగా ఏర్పడ్డ ఎల్లంపేట మున్సిపాలిటీలో జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపితే అసలు విషయం బయట పడతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

# అక్రమ షెడ్లపై చర్యలు తీసుకోవాలి

### టౌన్ ప్లానింగ్ విభాగం తీరుపై ఉన్నతాధికారులకు స్థానికుల డిమాండ్







టీపీఎ్. అక్బర్

శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) సిఎంసీ శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రభుపాద, హెచ్ఏఎల్ లేఔట్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అక్రమ షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, వార్తలు వస్తున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు తగిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన టీపీఎస్ అక్బర్‌పై అవినీతి ఆరోపణలు, అనుమతుల విషయంలో నిర్లక్ష్యానికి సంబంధించిన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారి లేదా సిఎంసీ ఉన్నతాధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. అక్రమ షెడ్ల నిర్మాణాలకు సంబంధించి అధికారులకు ముందస్తు సమాచారం ఉందా? ఉంటే ఇప్పటివరకు ఎలాంటి తనిఖీలు నిర్వహించారు? ఎన్ని నోటీసులు జారీ చేశారు? నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలను ఉన్నతాధికారులు ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగితే సిఎంసీ ఆదాయానికి నష్టం వాటిల్లడంతో పాటు భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వారు అంటున్నారు. ప్రభుపాద, హెచ్ఏఎల్ లేఔట్ ప్రాంతాల్లోని షెడ్లు, ఇతర నిర్మాణాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిర్మాణ అనుమతులు, భవన నిబంధనలు, భూ వినియోగ వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు.

**అవినీతి ఆరోపణలపై విచారణకు డిమాండ్**

టీపీఎస్ అక్బర్‌పై వస్తున్న అవినీతి ఆరోపణలపై సిఎంసీ ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆరోపణలకు ఆధారాలు లేనిపక్షంలో వాస్తవాలను అధికారికంగా వెల్లడించాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు ఎవరి సహకారం ఉన్నా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

**విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ పాత్రికేయుల సంక్షేమానికి సమష్టి బాట**

**న్యాయ సలహాదారు విశ్వనాథుల రమేష్‌తో అసోసియేషన్ నేతల కీలక భేటీ**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సంఘాన్ని మరింత పటిష్ఠంగా ముందుకు నడిపిస్తామని నాయకులు స్పష్టం చేశారు. అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత కమిటీల విస్తరణపై చర్చించేందుకు సంఘం ముఖ్య ప్రతినిధుల బృందం న్యాయ సలహాదారు విశ్వనాథుల రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సుదీర్ఘ సమాలోచనలు జరిపింది. నూతన బాధ్యుల నియామకాలు, పరిపాలనా పరమైన అంశాలపై ఆయనతో చర్చించి విలువైన సలహాలు, సూచనలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ జర్నలిస్టులను ఒకే తాటిపైకి తీసుకురావడం, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేయడం, క్షేత్రస్థాయిలో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంస్థాగత కమిటీల విస్తరణ, నూతన బాధ్యుల నియామకాలు, పరిపాలనా వ్యవహారాల సమన్వయం తదితర అంశాలపై న్యాయ సలహాదారు విశ్వనాథుల రమేష్‌తో ప్రతినిధులు చర్చించి ఆయన సలహాలు, సూచనలు తీసుకున్నారు. సంఘం ఎదుగుదలకు, సభ్యుల సంక్షేమానికి చట్టపరంగా పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఈ సందర్భంగా విశ్వనాథుల రమేష్ భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల అభ్యున్నతే లక్ష్యంగా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. వి లక్ష్మి. ఉపాధ్యక్షులుగా ఉల్లోజు శ్రీనివాసాచారీ, సలహాదారులు తాడికొండ రమేష్ ల నియమక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు ఎం నరసింహ చారిలతో పాలు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## న్యాయశాస్త్రంలో నూనె బాల్‌రాజ్ కు డాక్టరేట్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) శాసనసభ ప్రత్యేక హక్కులపై పరిశోధనలు పూర్తిచేసిన తెలంగాణ బీజేపీ నేత నూనె బాల్‌రాజ్ న్యాయశాస్త్రంలో డాక్టరేట్ సాధించారు. గురుగ్రామ్‌లోని కేఆర్ మంగళం యూనివర్సిటీలో ఆయన సమర్పించిన పరిశోధనలను ఆమోదిస్తూ, న్యాయశాస్త్రంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డాక్టరేట్ పట్టాను గత బుధవారం అధికారికంగా ప్రకటించింది. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్ పరిధిలో భారతదేశంలో శాసనసభా ప్రత్యేక హక్కులు -- న్యాయవ్యవస్థ స్పందన: ఒక విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై ఆయన పరిశోధన చేసారు. ఈ పరిశోధనకు డాక్టర్ ఆర్తి శర్మ సూపర్‌వైజర్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు కో-సూపర్‌వైజర్‌గా వ్యవహరించారు. భారతదేశంలోని శాసనసభా ప్రత్యేక హక్కుల రాజ్యాంగపరమైన పునాది, చారిత్రక పరిణామం, పరిధి, న్యాయవ్యవస్థ స్పందన, సమకాలీన సవాళ్లను ఆయన పరిశోధనలో విమర్శనాత్మకంగా విశ్లేషించారు. యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో అమలులో ఉన్న శాసనసభా ప్రత్యేక హక్కుల వ్యవస్థలను వివరంగా పరిశీలించారు. డాక్టరల్ వైవా వోస్ ముగింపు సందర్భంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ డాక్టర్ వాగేశ్వరి దేశ్వాల్ నిర్దేశిత విద్యా ప్రక్రియ అనంతరం ఆయన డాక్టరల్ డిఫెన్స్ విజయవంతంగా పూర్తయినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను డాక్టర్ ఎన్. బాల్‌రాజ్ గా ప్రకటించడం జరిగింది అని వెల్లడించారు. తన తొలి విద్యా మార్గదర్శకురాలైన ప్రొఫెసర్ ఇందర్‌ప్రీత్ కౌర్‌కు బాల్ రాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సూపర్‌వైజర్ డాక్టర్ ఆర్తి శర్మ, కేఆర్ మంగళం యూనివర్సిటీ, కో-సూపర్‌వైజర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేఆర్ మంగళం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అనిల్ కుమార్ సైనీ, చైర్ ప్రొఫెసర్ డాక్టర్ మెహ్రాజ్ ఉద్దీన్ మీర్, డీన్ డాక్టర్ కావేరి శర్మ, హెడ్ లైబ్రేరియన్ డాక్టర్ హెలాలుద్దీన్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో పుట్టి పెరిగిన బాల్‌రాజ్ విద్యార్థి దశ నుంచే ప్రజా, సంస్థాగత కార్యక్రమాలతో అనుబంధం ఏర్పరుచుకున్నారు. 1987లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో అనుబంధం పెంచుకున్న ఆయన వీ.హెచ్.పీ లోను చురుకుగా పనిచేసారు. అనంతరం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)తో పాటు పలు విద్యార్థి, సామాజిక సంస్థల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1996లో భారతీయ జనతా పార్టీలో చేరి సంస్థాగత, ప్రజాసేవా బాధ్యతల్లో కొనసాగారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పట్టాలు పొందిన ఆయన సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు, తెలంగాణ హైకోర్టు తదితర న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ప్యానెల్ కౌన్సెల్, సీనియర్ ప్యానెల్ కౌన్సెల్‌గా సేవలందించారు. బీజేపీ సంస్థాగత బాధ్యతల్లో భాగంగా తెలంగాణకు సంబంధించిన బాధ్యతలతో పాటు న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో సరల్ కార్యక్రమానికి సంబంధించిన బాధ్యతలు నిర్వహించారు. సెంట్రల్ బీజేపీ కోఆర్డినేటర్ (తెలంగాణ), సరల్ నేషనల్ ఇన్‌చార్జ్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు రాష్ట్రపతి భవన్ డిజిటల్ లైబ్రరీ సహా పలు ప్రజా రికార్డుల్లో నమోదయ్యాయి. అందరికీ సమాన అవకాశాలు అనే లక్ష్యంతో స్థాపించిన త్రీనేత్ర ఫౌండేషన్ ద్వారా విద్య, పరిశోధన, సామాజిక సేవ, వెనుకబడిన వర్గాలకు అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు చేపట్టారు. విద్యాదానం, విద్యా కార్యక్రమాలు, పరిశోధనా కార్యక్రమాలు, సమాజ ఉపయోగ కార్యక్రమాలకు మద్దతు అందించారు. విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు, విద్యా సదస్సులకు నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా కూడా ఫౌండేషన్ వ్యవహరించింది. క్రీడా పరిపాలనలోను బాధ్యతలు చేపట్టిన బాల్‌రాజ్ 2025 అక్టోబర్‌లో 2025--2028 కాలానికి తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అసోసియేషన్ కొత్త గవర్నింగ్, అపెక్స్ కౌన్సిళ్ల ఏర్పాటులో భాగంగా ఈ నియామకం జరిగింది. అయితే న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ సాధన మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. శాసనసభా ప్రత్యేక హక్కులపై ఆయన చేసిన పరిశోధన, న్యాయం, రాజ్యాంగ సంస్థలు, ప్రజా వ్యవహారాలపై ఆయనకున్న అనుభవాన్ని దీర్ఘకాలిక విద్యా అధ్యయనంతో అనుసంధానించింది. ఈ డాక్టరేట్ సాధన కేవలం ఒక విద్యా అర్హత మాత్రమే కాదని, ఎన్నో సంవత్సరాల అధ్యయనం, పరిశోధన, పట్టుదల, మేధోపరమైన కృషి ఫలితంగా ఇది సాధ్యమైందని, న్యాయం, రాజ్యాంగ పరిపాలనపై తన అధ్యయనాన్ని మరింతగా కొనసాగించేందుకు ఈ విజయం ప్రేరణనిస్తుందని తెలిపారు. తన ప్రయాణంలో తోడుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# "ఎస్బిఐ"ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్

## - ఎస్.రవీంధర్ రెడ్డి.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో కోటికి పైగా ప్రజలు నిలుస్తున్నారు. వీరిలో ముప్పై శాతం వయోవృద్ధులు,ఇరవై ఏడు శాతం పసిపిల్లలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జంటనగరాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరి చేతిలో అత్యఆధునిక చరవాణిలు కోకొల్లలుగా దర్శనమిస్తాయి. మరి ముఖ్యంగా పిల్లలు, వయోవృద్ధులకు సైతం ఫోన్లు ఇవ్వడంతో పలు అనర్ధాలకు దారి తీస్తున్న సంఘటనలు కోకొల్లలు. సంచారి పూరి కాలనీలో "ఎస్బిఐ ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్"కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఒకటో వార్డులో నిన్న ఫిరోజ్ గూడ శాఖకు చెందిన ఎస్బిఐ బ్యాంకు నిర్వాహకులు సంచారి పూరి కాలనీలో వివిధ ప్రాంతాలకు చెందిన ఖాతాదారులతో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు.

### నకిలీ సందేశాలు:ప్రస్తుతం భాగ్యనగర వాసులు ఫేక్

మేసేజ్ ల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశంలోసాంకేతికత పెరిగిన కొద్దీ మోసాలు మరింత ఎక్కువైపోతున్నాయని "సైబర్ క్రైమ్" అధికారులు చెబుతున్నారు.

### సిటీ పబ్లిక్ పరిషాన్లు:

ఆర్థిక నష్టాలు: ప్రతి ఒక్కరి దగ్గర ఫోన్లు ఉండడం సర్వసాధారణం అయిపోయాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరి చేతిలో ఫోన్లు ఉండడం మనం గమనించవచ్చు. కానీ అసలు ట్రిక్ ఇక్కడే మొదలవుతుంది. ఫోన్లల్లో వచ్చే సందేశాలు ఉచిత బహుమతులు, లాటరీలు, తక్కువ వడ్డీకే రుణాలు, పార్ట్ టైం ఉద్యోగాలు పేరుతో వచ్చే నకిలీ లింకులను క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతాదారుని ఖాతాలో సొమ్ము స్వాహా అయినట్లే.

### వ్యక్తి గత సమాచారం చోరీ:

ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్నీ భద్రంగా దాచుకోవాల్సిన వివరాలు. ఫేక్ కాల్ తో (ఆధార్ కార్డు అప్ డేట్, పాన్ కార్డు సమస్య, కరెంట్ బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ చేసే భయపెట్టే మేసేజ్ లు) పూర్తి సమాచారం సైబర్ నేరస్తులు లాగేస్తారు.

### మానసిక ఒత్తిడి, భయాందోళనలు:

ఈ మధ్య సామాన్యులకు, అధికారులకు తేడా లేకుండా మీరు క్రైం చేశారని, మీ బ్యాంకు ఖాతా రద్దు, అలాగే కుటుంబ సభ్యులకు ప్రమాదం జరిగిందని వచ్చే వర్తమానాలు అందర్నీ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు,దాని వల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారు.

### ఫేక్ మేసేజ్ లతో లాభాలు:

గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయొద్దు. ఓటిపి బ్యాంకు వివరాలను ఎవ్వరికీ వెల్లడించారాదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక "వెబ్ సైట్లు"మాత్రమే సమాచారాన్ని ధృవీకరించుకోవాలి. ఒకవేళఏదైనా అనుమానం వస్తే "సైబర్ సెల్ " ద్వారా అనుమానాలు నివృత్తి చేసుకోవాలి. ఫిరోజ్ గూడఎస్బిఐ బ్యాంకు నిర్వాహకులు కారిక్రమంలో పాల్గొన్న వృద్ధులకు, పిల్లలకు ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలుఈ వయస్సు వారినే సైబర్ నేరస్తులు టార్గెట్ చేస్తున్నారని దయచేసి వారి మేసేజ్ లకు, లింకులు ప్రభావితం అయ్యి మీ వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకున్న అణా పైసా లేకుండా చేస్తారని, తల్లిదండ్రులు ఇంట్లో ఉన్న వృద్ధులకు, పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం వల్ల భారీ నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి ఎదురౌతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో "సంచార పూరి"కాలనీ అధ్యక్షుడు ఎస్.రవీంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో,నేరాలు కూడా అదే స్థాయిలో నమోదు అవుతున్నాయి. ప్రజలు కూర్చున్న చోటే అన్ని పనులు చేసుకునే విధంగా వెసులుబాటు కల్పిస్తున్నాయి కొన్ని కంపెనీలు. వాటికి అలవాటు పడి సమస్యలు కొని తెచ్చుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఉదాహరణకు: మనం ఇంట్లో ఉన్నప్పుడు" రిమోట్"ద్వారా టివి, ఫ్యాన్, ఏసీ, డోర్, విండోస్ క్లోజింగ్ పలు రకాల సేవలు లేవకుండానేఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్దల దగ్గర ఉన్న ఫోన్ స్మార్ట్ ఫోన్ కావడంతో ఏదో మేసేజ్ వచ్చిందని లింక్ ఓపెన్ చేస్తే చాలు తన ఖాతాలో ఉన్న సొమ్ము "గుండు సున్నా"గా మారిపోతుంది. ఈ మధ్యనే మాంద్యాల్లో వచ్చిన విషయమే పన్నెండు సంవత్సరాల పిల్లవాడు తన తల్లి స్మార్ట్ ఫోన్ లో "పబ్జి గేమ్"ఆట ఆడి సుమారు లక్షల రూపాయలు పోగొట్టుకున్నట్లు మనకి తెలిసిందే. దయచేసి వీలైనంత వరకు"స్మార్ట్ ఫోన్లకి దూరం, మానం స్మార్ట్ గా ఉందామని స్లోగన్ ఇచ్చారు ఎస్.రవీంధర్ రెడ్డి.

# ఎమ్మార్వో,ఆర్ఐ కనికట్టులో

# అన్నదాత గుండె ఆగింది

- కొత్త రాష్టం,కొత్త కష్టాలు, అన్నదాతలు శాపనార్థాలు. - అసలే"ఎల్ నినో "తో కష్టాల కడలిలో రైతన్నలు
- తాజా,మాజీ పాలకులు ఒకరి పై మరొకరు ఆరోపణలు చేసుకోవడమే
- తప్ప,అన్నదాతలను మరిచారు,ఇక ముందు అన్ని అవస్థలే అంటున్నరైతన్నలు
- తెలంగాణ రాష్టంలో వ్యవసాయం గణనీయంగా తగ్గినట్లు కనబడుతోంది.?
- కొత్త రాష్టంలో భూమి ధరలు ఆకాశాన్ని తాకడంతో ల్యాండ్ మాఫియా అమాయక రైతుల భూముల పై కన్ను
- దీనికి తోడు "రెవెన్యూ అధికారులు,మరి ముఖ్యంగా ఎమ్మార్వో లు, ఆర్ఐలు రెచ్చిపోతున్నారు.
- ఈ మధ్య నగర శివార్లలో తాశీల్దార్ లా తయ్యు తక ఆటలు తెర మీదకు వస్తున్నాయి.



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చేవెళ్లలో భూమి కోసం ఆగిన పేద గుండె. బుడగ జంగం(ఎస్టి బిచ్చగాడు) కుటుంబానికి చెందిన వారణాసి యాదయ్య(50) శనివారం రాత్రి భోజనం చేసిన అనంతరం భూమి గురించి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి పడుకున్న తర్వాత అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. యాదయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### కుటుంబ సభ్యులు,గ్రామస్తుల వివరాల ప్రకారం..
### గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తిమ్మారెడ్డి

గూడెంలో సర్వే నెంబర్:483 లో వందల ఏళ్ల క్రితం గ్రామస్థులకు భూములు ఉండేవని వాళ్ళు కొన్నేళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. రెవిన్యూ అధికారులు గ్రామస్థులను ఇబ్బందులకు గురి చేస్తూ వారి చావుకు కారణం అవుతున్నారు. ఈ గ్రామంలో ఒక్క యాదయ్య సమస్య కాదు పదుల సంఖ్యలో ఉన్న వారి బాధలు. ఎమ్మార్వో,ఆర్ఐ బాగ బరితెగించి అన్నదాతల పట్ల చిన్నచూపు చూస్తూ వారి మనో వేదనకు కారణం అవుతున్నారు. ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్తే బండ బూతులు మాట్లాడుతున్నారు. అలాగే ఆయన తనయుడు మాట్లాడుతూ యాదయ్య తండ్రి పేరు పై సర్వే నంబర్ 483లో నాలుగు ఎకరాల ప్రభుత్వ (లావని) భూమి ఉన్నట్లు తెలిపారు. ఈ భూమిని ప్రభుత్వం తీసుకోవడమే కాకుండా రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబర్ 483లో ప్రభుత్వం భూమిగా,ఖాలీగా 4 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు నమోదు చేశారు. అయితే యాదయ్య తండ్రి,ముత్తాతల నుంచి వస్తున్న ఈ నాలుగు ఎకరాల భూమి అలాగే సర్వే నెంబర్ 483 తమ ఆధీనంలో ఉన్నది అనుకునే సరికి,రెవెన్యూ అధికారులు అత్యుత్సాహంతో ఇప్పుడు ఎలాంటి భూమి యాదయ్య కు సంబంధించిన భూమి లేనట్లు రికార్డులు చూయిస్తున్నారు. ఈ విషయంపై తన కొడుకు కోడలు పలుమార్లు ఎమ్మార్వో,ఆర్డిఓ కార్యలయాలకు తిరిగారు. మాభూమి చూయించండి సార్ అని ఎంత మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోకుండా ఆ పేద కుటుంబానికి సమాధానం ఇవ్వకుండా జారుకుంటున్నారని యాదయ్యకు ఊహా వచ్చినప్పటి నుంచి ఆ భూమి తనదేనని ఇప్పుడు అస్మాదీయులతో చెయ్యి కలిపి తన సొంత భూమిని కొట్టేశారని మనస్థాపానికి గురైన యాదయ్య నిన్న రాత్రి గుండెపోటుతో మరణించాడని కొడుకు ఆవేదన వ్యక్తంచేశారు. యాదయ్య మరణానికి కారణం అధికారుల నిర్లక్ష్యమే అని తను ఎన్నోసార్లు భూమి విషయమై బాధపడి బాధపడి అన్నం తినక గుండె పగిలి చనిపోయాడని కుటుంబ సభ్యులు ఎమ్మార్వో ఆర్ఐ వల్లే తన తండ్రి చావుకు కారణం మని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు కూడా అధికారుల నిర్లక్ష్యం వల్లే యాదయ్య మృతి చెందినట్లు గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులను తప్పుపడుతున్నారు. షాబాద్ ఎమ్మార్వో ఆర్ఐ ఇద్దరు కుమ్మక్కై పేద ప్రజల భూమిని ఉన్న వాళ్లకు లేనట్టుగా లేని వాళ్లకు ఉన్నట్టుగా చూయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎమ్మార్వోఆర్ఐ లీలలు ఒకటి కాదు రెండు కాదు వారి నేరాల చిట్టా పెద్దదే వాటిని జిల్లా కలెక్టర్ దగ్గర తేల్చుకుంటామని, అలాగే రెవెన్యూ రికార్డుల్లో ఎన్ని మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయో మా దగ్గర ఆధారాలు ఉన్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఆర్ఐ విజయ్ కుమార్ చేసే నేరాల చిట్టా పెద్దదే! సాక్షాత్తు వారి బంధువుల పేర్లను కూడా ఈ భూమిలో ఉన్నట్లు చూయిస్తున్నాడని గ్రామస్తులు ఆయన పై ఆరోపిస్తున్నారు. ఎమ్మార్వో, ఆర్ఐ పై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు లేనిపక్షంలో మరికొన్ని ప్రాణాలు పోయే అవకాశం ఉన్నట్లు గ్రామ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి నిజమైన రైతులకు భూమిని కేటాయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. యాదయ్య మృతితో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. భూమి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఒకవేళ ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాకపోతే గ్రామం అంతా ఏకమై ఎమ్మార్వో ఆర్ఐ లీలలు ఆరికట్టేదాక, యాదయ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని గ్రామస్తులు ముక్తకంఠంతో నినదించారు.

## అంచనాలు పెంచిన 'భోగి' టీజర్..

# కమ్మరి గంగగా శర్వానంద్ విశ్వరూపం!




టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ తన పంథా మార్చి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ అవతారంలోకి అడుగుపెట్టారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'భోగి' టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. దర్శకుడు సంపత్ నంది తనదైన శైలిలో రూపొందించిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పచ్చి పల్లెటూరి నేపథ్యం, తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలు, బలమైన భావోద్వేగాలతో టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. శర్వానంద్‌ను మునుపెన్నడూ చూడని రఫ్ లుక్‌లో చూపించడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమా కథ 1960ల కాలంలో తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ఒక గ్రామంలో జరుగుతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. ఆనాటి సమాజంలో పాతుకుపోయిన భూస్వామ్య వ్యవస్థ, అణచివేత, హింస వంటి అంశాలను కథలో ప్రధానంగా ప్రస్తావించినట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో శర్వానంద్ 'కమ్మరి గంగ' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. వృత్తిరీత్యా కమ్మరి అయిన గంగ, తన గ్రామాన్ని గుప్పిట్లో పెట్టుకున్న పెత్తందారులకు ఎదురు తిరిగే సామాన్యుడి ప్రతినిధిగా నిలబడతాడు. టీజర్‌లో శర్వానంద్ చెప్పిన సంభాషణలు, ఆయన నటన పాత్రలోని తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. గ్రామస్తుల కష్టాలు, వారిపై జరిగే దౌర్జన్యాలు, పోలీసులతో ఘర్షణలు, అణచివేతపై గంగ చేసే పోరాటం వంటి సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మట్టి వాసనను ప్రతిబింబించే దృశ్యాలు, రక్తపాతంతో నిండిన యాక్షన్ ఘట్టాలు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, టీజర్‌లోని నేపథ్య సంగీతం సన్నివేశాలకు మరింత బలాన్నిచ్చింది. 'భోగి' చిత్రాన్ని నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంతో శర్వానంద్ మాస్ హీరోగా మరో మెట్టు ఎక్కుతారని అభిమానులు ఆశిస్తున్నారు.



## నెట్టింటిని షేక్ చేస్తోన్న

# భాగ్య శ్రీ బోర్సే

మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ బోర్సే.. ఆ తర్వాత కింగ్ డమ్, ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాల్లో నటించగా.. ఈ మూవీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయాయి. చివరగా అఖిల్ అక్కినేనితో కలిసి నటించిన లెనిన్ ఈ బ్యూటీకి మంచి విజయాన్ని అందించింది. సంప్రదాయ దుస్తుల్లో, ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో అయినా కెమెరాకు ఫోజులిచ్చిందంటే ఈ భామ లుక్స్ కు ఫిదా అవ్వాల్సిందే.భాగ్య శ్రీ బోర్సే తాజా స్టైలిష్ క్యాజువల్ లుక్‌కు సంబంధించిన ఫొటోలను నెట్టింట పోస్ట్ చేసింది. బ్లూ డెనిమ్, మినీ స్కర్ట్‌లో ట్రెండీ టచ్ ఇస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. హెరిటేజ్ బిల్డింగ్, తాటి చెట్ల ముందు కూర్చొని దిగిన స్టిల్స్ కుర్రకారుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.




# సల్మాన్ ఖాన్ 'మాతృభూమి' చిత్రానికి ప్రభుత్వ క్లియరెన్స్..

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నటించిన తాజా చిత్రం 'మాతృభూమి' ఎట్టకేలకు ప్రభుత్వ క్లియరెన్స్ పొందింది. ఈ సినిమా విడుదలకు సంబంధించి నెలకొన్న అనిశ్చితి తొలగిపోయింది. తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో 2020లో భారత్–చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ ఆధారంగా ఈ వార్ డ్రామా రూపుదిద్దుకుంది. ముందుగా ఈ చిత్రానికి 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' అనే టైటిల్ ఖరారు చేసినప్పటికీ, ఆ తర్వాత 'మాతృభూమి'గా మార్చారు. భారత్–చైనా సంబంధాల మెరుగుదల నేపథ్యంలో చైనాను చిత్రంలో చూపించిన విధానంపై రక్షణ మంత్రిత్వ శాఖ కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సినిమా విడుదల ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమాలో కొన్ని మార్పులు చేసి సవరించిన వెర్షన్‌ను అందజేశారు. దీనిపై సంతృప్తి చెందిన కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ గత వారమే ఈ చిత్రానికి నో–అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేసింది. ఇప్పుడు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ తంతు త్వరగా ముగిస్తే నవంబర్ 13న సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని సల్మాన్ ఖాన్ భావిస్తున్నట్లు సమాచారం. దీపావళి పండుగ తర్వాత ప్రేక్షకులు సెలవు వాతావరణంలో ఉంటారు కాబట్టి, నవంబర్ 13న విడుదల చేయడం సరైన సమయమని సల్మాన్ భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. త్వరలోనే విడుదల తేదీపై పూర్తి స్పష్టత రానుంది. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్‌తో పాటు చిత్రంగదా సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మరోవైపు సల్మాన్ ఖాన్ వంశీ పైడిపల్లి దర్శకత్వంలో నయనతారతో కలిసి మరో కొత్త ప్రాజెక్ట్ లో కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే.

## బాక్సాఫీస్ వద్ద బాలీవుడ్

# 'దృశ్యం 3' సంచలనం..

### తొలిరోజే రికార్డు వసూళ్లు!




బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవ్‌గన్ నటించిన మోస్ట్ అవేటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3: ది కన్‌క్లూజన్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తూ దూసుకుపోతోంది. సినిమా విడుదలకు ముందే ఆన్‌లైన్‌లో బుకింగ్స్ జోరుగా సాగగా, విడుదలైన మొదటి రోజే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అన్ని రికార్డులను తిరగరాసింది. గాంధీ జయంతి (అక్టోబర్ 2) కానుకగా గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమాకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో అద్భుతమైన స్పందన లభించింది. విడుదల కంటే ముందే అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలోనే రూ. 50 కోట్లకు పైగా వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచిన ఈ చిత్రం, తొలి రోజు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 62–66 కోట్ల నెట్ కలెక్షన్లను సాధించింది. ఓవర్సీస్‌తో కలుపుకుని తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 95.10 కోట్ల గ్రాస్ వసూళ్లతో వంద కోట్ల మార్కుకు అత్యంత చేరువయింది. అజయ్ దేవ్‌గన్ గత చిత్రాల రికార్డులను అధిగమించి, ఆయన కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా నిలవడమే కాకుండా, బాలీవుడ్ చరిత్రలో థర్డ్ బిగ్గెస్ట్ ఓపెనర్‌గా ఘనత సాధించింది. సినిమా చూసిన ప్రేక్షకులు మరియు క్రిటిక్స్ నుంచి క్లైమాక్స్ మరియు స్క్రీన్‌ప్లే చాలా బాగున్నాయని పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. విజయ్ సల్గాంకర్ పాత్ర మరోసారి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుందని, మహారాష్ట్ర, ఢిల్లీ–చీజ= ప్రాంతాలలో హౌస్‌ఫుల్ బోర్డులతో ప్రదర్శనలు కొనసాగుతున్నాయని ట్రేడ్ నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ జోరు చూస్తుంటే రాబోయే వీకెండ్‌లో ఈ సినిమా మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# దసరా పండుగ బరిలో టాలీవుడ్ బాక్సాఫీస్ పోరు..

## ఈసారి పోటీ పడుతున్న క్రేజీ చిత్రాలు ఇవే!







ప్రతిష్ఠాత్మకమైన దసరా పండుగ సీజన్ సమీపిస్తుండటంతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సందడి ఒక్కసారిగా తారాస్థాయికి చేరుకుంటోంది. పండుగ సెలవులను పూర్తిగా క్యాష్ చేసుకునేందుకు ఈసారి ఏకంగా నాలుగు క్రేజీ చిత్రాలు థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమయ్యాయి. డిఫరెంట్ జానర్లు, భారీ తారాగణంతో వస్తున్న ఈ సినిమాలపై సినీ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఈ పండుగ రేసులో విక్టరీ వెంకటేష్, సూపర్ స్టార్ రజనీకాంత్, రౌడీ హీరో విజయ్ దేవరకొండ వంటి స్టార్ హీరోలతో పాటు టాలెంటెడ్ యాక్టర్ శ్రీవిష్ణు కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ బాక్సాఫీస్ పోరులో భాగంగా అందరికంటే ముందుగా అక్టోబర్ 9న విక్టరీ వెంకటేష్ నటిస్తున్న 'ఆదర్శకుటుంబం' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఫ్యామిలీ ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. కేవలం కుటుంబ భావోద్వేగాలే కాకుండా, చక్కటి క్రైమ్ ఎలిమెంట్స్‌ను కూడా జోడించి స్టైలిష్‌గా ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది. ఇక సరిగ్గా అదే రోజున యంగ్ హీరో శ్రీవిష్ణు నటించిన 'కామ్రేడ్ కళ్యాణ్' కూడా విడుదలవుతోంది. నక్సలిజం బ్యాక్‌డ్రాప్‌లో సాగే సీరియస్ కథాంశానికి భిన్నమైన కామెడీని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక దసరా పండుగ అసలు సిసలు సమరం వారం మధ్యలో ప్రారంభం కానుంది. అక్టోబర్ 15న సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. సంచలన విజయం సాధించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై ఇటు తమిళంలోనూ, అటు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ హైప్ క్రియేట్ అయింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఈసారి యాక్షన్ మరియు ఎంటర్‌టైన్‌మెంట్‌ను మరింత డోస్ పెంచి తెరకెక్కించినట్లు సమాచారం. ఈ సినిమాతో పాటు అక్టోబర్ 16న రౌడీ హీరో విజయ్ దేవరకొండ పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి'తో థియేటర్లలోకి అడుగుపెట్టనున్నారు. 'టాక్సీవాలా' తర్వాత విజయ్, రాహుల్ సాంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంపై ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ బజ్ నెలకొంది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ కథలో విజయ్ లుక్ పూర్తిగా భిన్నంగా ఉండబోతోంది. మొత్తానికి ఈ నాలుగు చిత్రాల్లో ఏది బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుని బాక్సాఫీస్‌ను శాసిస్తుందనేది వేచి చూడాలి.

## నెల రోజులు కూడా తిరగకముందే

# ఓటీటీలోకి 'మండాడి'..




కోలీవుడ్‌లో హాస్య నటుడిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత తిరుగులేని మాస్ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సూరి. మరోవైపు విలక్షణమైన నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న యువ నటుడు సుహాస్ కలిసి నటించిన సినిమా 'మండాడి'. సముద్ర తీర ప్రాంతం నేపథ్యంలో, సంప్రదాయ పడవల పందెం చుట్టూ అల్లుకున్న ఈ సస్పెన్స్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాకు మథిమారన్ పుగళేంది దర్శకత్వం వహించారు.సెప్టెంబరులో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మండాడి'కి థియేటర్లలో అద్భుతమైన స్పందన లభించింది. సూరి మాస్ అవతార్, సుహాస్ ప్రతినాయక ఛాయలున్న పాత్ర, సముద్రం నేపథ్యంలో తెరకెక్కిన యాక్షన్ సన్నివేశాలు, పడవల పందెం చుట్టూ సాగే ఉత్కంఠభరిత కథ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ ఏడాది కోలీవుడ్‌లో భారీ విజయాలను అందుకున్న చిత్రాల జాబితాలో 'మండాడి' కూడా చోటు సంపాదించింది. సముద్రం ఒడ్డున జీవించే మత్స్యకారుల జీవనం, వారి హక్కులు, గౌరవం, సంప్రదాయ పడవల పందెం చుట్టూ కథ సాగుతుంది. తన జాతి మనుగడ కోసం పోరాడే ముత్తుకాళి అలియాస్ కాళి పాత్రలో సూరి కనిపించారు. తన ప్రాంతానికి పెద్దదిక్కుగా నిలిచే మాచముని పాత్రలో సీనియర్ నటుడు సత్యరాజ్ నటించారు. ఇక సుహాస్ ఈ సినిమాలో సాట్టపులి అనే ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించారు. తీర ప్రాంతంలో చేపల వేటపై ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తూ.. కాళి బృందాన్ని దెబ్బతీయడానికి పలు వ్యూహాలు రచించే పాత్రలో ఆయన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. కాళి మాజీ ప్రేయసి ఏంజెల్, ఆమె భర్త సింగారం చుట్టూ ఉన్న పాత విభేదాలను తనకు అనుకూలంగా మార్చుకుని సాట్టపులి చేసే మైండ్ గేమ్స్ కథలో ఆసక్తిని పెంచుతాయి. థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న 'మండాడి' డిజిటల్ విడుదల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సినిమా థియేట్రికల్ రన్ పూర్తిగా ముగియకముందే ఓటీటీలోకి వస్తుందనే వార్తలు ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ 8 లేదా 9వ తేదీ నుంచి 'మండాడి'ని ఓటీటీలో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.అయితే ఓటీటీ విడుదల తేదీపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# బిగ్‌బాస్ జోలికి వెళ్లేది లేదు..

## మరోసారి హోస్ట్‌గా కనిపించనంటూ క్లారిటీ!



తెలుగు బుల్లితెరపై అత్యంత పాపులర్ రియాలిటీ షోలలో బిగ్‌బాస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి సీజన్‌లోనూ కంటెస్టెంట్ల ఆటతీరు, గొడవలు, ఎలిమినేషన్లు, వీకెండ్ ఎపిసోడ్స్ ఇలా ఏదో ఒక అంశం చర్చనీయాంశంగా మారుతూనే ఉంటుంది. అయితే ఈ షోతో అనుబంధం ఉన్న కొందరు సెలబ్రిటీల వ్యాఖ్యలు కూడా అప్పుడప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. తాజాగా నేచురల్ స్టార్ నాని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. తెలుగు బిగ్‌బాస్ తొలి సీజన్‌కు ఎన్టీఆర్ హోస్ట్‌గా వ్యవహరించగా.. రెండో సీజన్ బాధ్యతలను నాని చేపట్టారు. అప్పటికే హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని.. తన సహజమైన శైలితో షోను నడిపించారు. కంటెస్టెంట్లతో నేరుగా మాట్లాడటం, వారి ఆటతీరుపై అభిప్రాయాలు చెప్పడం, తనదైన టైమింగ్‌తో ఎపిసోడ్స్‌ను రక్తికట్టించడం ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.అయితే అదే సమయంలో నాని కొన్ని విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కొందరు కంటెస్టెంట్లకు నాని అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. కౌశల్ అభిమానుల నుంచి కూడా నానికి తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ ఎదురైన విషయం అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. బిగ్‌బాస్ వంటి రియాలిటీ షోకు హోస్ట్‌గా వ్యవహరించడం సినిమాల్లో నటించడంతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన అనుభవమని నాని గతంలోనే తెలుసుకున్నారు. ఒక సినిమాలో హీరో పాత్రకు ప్రేక్షకులు స్పందించే తీరు వేరు.. కానీ బిగ్‌బాస్‌లో హోస్ట్‌గా ఉన్నప్పుడు ప్రతి కంటెస్టెంట్ అభిమానుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ షో తనకు ఎన్నో విషయాలు నేర్పిందని తెలిపారు. అయితే ప్రస్తుతం తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. నటుడిగా ప్రేక్షకులను అలరించడమే తనకు ఎక్కువగా ఇష్టమని, రియాలిటీ షో హోస్టింగ్ మళ్లీ చేయడం తనకు అంతగా ఆసక్తి లేదనే సంకేతాలు ఇచ్చారు.నాని వ్యాఖ్యలను బట్టి చూస్తే.. భవిష్యత్తులో మరోసారి బిగ్‌బాస్ హోస్ట్‌గా కనిపించే అవకాశాలు తక్కువగానే ఉన్నట్లు అర్థమవుతోంది. బిగ్‌బాస్ సీజన్ 2లో హోస్ట్‌గా తనకు ఎదురైన అనుభవం, వచ్చిన ట్రోలింగ్ కూడా ఆయన నిర్ణయంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. అయితే నాని హోస్టింగ్‌ను గుర్తు చేసుకుంటున్న బిగ్‌బాస్ అభిమానులు మాత్రం ఆయన మరోసారి షోలోకి రావాలని కోరుకుంటున్నారు.

## సేవా రంగంలో సత్తా చాటిన రాణి నల్లమోతు

### గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిన వెబ్బిక్ యూనివర్సిటీ

### సేవా మార్గంలో విశిష్ట గుర్తింపు



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ రాణి నల్లమోతుకు అరుదైన గౌరవం దక్కింది. సేవా రంగంలో ఆమె చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా వెబ్బిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

**విశిష్ట సేవలకు గుర్తింపు**

సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న సీతాస్ చారిటబుల్ ట్రస్ట్.సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో రాణి నల్లమోతు విశేష కృషి.సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు అండగా నిలుస్తున్న సీతాస్.ప్రజా సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కార్యక్రమాల నిర్వహణ.ఆమె సేవలను గుర్తించిన వెబ్బిక్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కారం.ఈ గౌరవం సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది.ఈ సందర్భంగా రాణి నల్లమోతు మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించిన వెబ్బిక్ యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని పేర్కొన్నారు.

## రిజర్వేషన్ల తీర్పు రాగానే..

# మున్సిపల్ ఎన్నికలు

### సుప్రీం తీర్పు తర్వాత ఎన్నికల ప్రక్రియ వేగవంతం

### అడ్డంకులన్నీ అధిగమించి ఎన్నికలు పూర్తి చేస్తాం: మంత్రి నారాయణ



నెల్లూరు(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఖాయమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఎన్నికలు నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన సుమారు రూ.12 వేల కోట్ల నిధులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.నెల్లూరులో ఆదివారం మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే ఆదేశించారని చెప్పారు. అయితే బీసీ రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున.. తీర్పు కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు.

**తీర్పు రాగానే కదలిక**

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంటుందని మంత్రి వెల్లడించారు. వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ ఎన్నికల సంఘం పరిధిలో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికలకు పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు.

**స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం**

విజన్‌తో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా విజయవంతంగా పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## ఆరోగ్య పరిరక్షణకు

## ఆరిక్యూలార్ ఆక్యుపంక్చర్ శిక్షణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రత్యామ్నాయ ఆరోగ్య విధానాలపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో శ్రీ గురు యోగ మరియు న్యాచురల్ హీలింగ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ లో ఆరిక్యూలార్ ఆక్యుపంక్చర్ థెరపీ నాలుగో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రైనర్ శివకృష్ణ, కోఆర్డినేటర్ హరిత సమన్వయంతో నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు శిక్షణార్థులు పాల్గొన్నారు. ఆరిక్యూలార్ ఆక్యుపంక్చర్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలు, విధానాలు, ఆరోగ్య పరిరక్షణలో దాని వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ట్రైనర్ శివకృష్ణ మాట్లాడుతూ, ఆరిక్యూలార్ ఆక్యుపంక్చర్‌ను వివిధ ఆరోగ్య సమస్యల్లో ప్రత్యామ్నాయ థెరపీ విధానంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శిక్షణ ద్వారా కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ప్రాథమిక సహాయం అందించడంలో అవగాహన పెంపొందించుకోవచ్చన్నారు.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి శాస్త్రీయ ప్రాణాయామ యోగా నిపుణులు, వైద్య రత్న చంద్రకాంత్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణార్థులను అభినందిస్తూ, సంప్రదాయ యోగా, ప్రాణాయామం, సహజ ఆరోగ్య విధానాలపై శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.శ్రీ గురు యోగ మరియు న్యాచురల్ హీలింగ్ కోఆర్డినేటర్ హరిత మాట్లాడుతూ ఆరిక్యూలార్ ఆక్యుపంక్చర్‌పై ఆసక్తి ఉన్నవారి కోసం భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో శిక్షణార్థులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రా

# అప్పలరాజుకు ఎమ్మెల్యే గౌతు శిరీష సవాల్



వజ్రపుకొత్తూరు(ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో పదవి అంటే అధికారం చెలాయించేందుకు కాదని.. ప్రజలకు సేవ చేసేందుకు దక్కిన బాధ్యత అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. అభివృద్ధి విషయంలో మాటలకే పరిమితం కాకుండా ప్రతి పంచాయతీలో కనీసం ఒక్క అభివృద్ధి పనైనా చేసి ప్రజల ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు సవాల్ విసురుతూ..

ఆయన మంత్రిగా ఉన్న ఐదేళ్లలో చేసిన అభివృద్ధి.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని గొల్లసారథి, చిన్నడోకులపాడు, పల్లిసారథి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు.

**ఓట్ల కోసం కాదు.. పనులు చేసి ఓట్లు అడుగుతాం**

ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని శిరీష తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినప్పుడు ప్రతి పంచాయతీలో, ప్రతి గ్రామంలో కనీసం ఒక్క అభివృద్ధి పనిని పూర్తి చేసి ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతామని గతంలోనే చెప్పామని గుర్తుచేశారు.

ప్రజలు ఇచ్చిన పదవిని హోదాగా భావించకుండా బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులతోనే ప్రజల విశ్వాసాన్ని పొందుతామని స్పష్టం చేశారు.

**రెండేళ్లలో రూ.2 వేల కోట్ల పనులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పలాస నియోజకవర్గ అభివృద్ధికి రూ.2 వేల కోట్ల నిధులు తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని శిరీష తెలిపారు.

గత ఐదేళ్లలో జరగని అనేక అభివృద్ధి పనులను రెండేళ్లలోనే చేపట్టామని చెప్పారు.గ్రామాల్లో రహదారులు, తాగునీరు, మౌలిక వసతులు, పంచాయతీరాజ్ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పల్లెల్లో అభివృద్ధి పనులతో పండుగ వాతావరణం నెలకొందని పేర్కొన్నారు.

# మంగళగిరి సేవలు.. మధుర జ్ఞాపకాలు

### - నార్త్ డీఎస్పీగా రెండేళ్ల రెండు నెలల సేవలకు మురళీకృష్ణ వీడ్కోలు

### - విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా బదిలీ

మంగళగిరి(ప్రశ్న న్యూస్) మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా రెండేళ్ల రెండు నెలల పాటు విధులు నిర్వర్తించిన సీహెచ్ మురళీకృష్ణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తన పదవీకాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నివాసం, ప్రధాన రాజకీయ పార్టీల కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల ప్రధాన కార్యాలయాలు ఉన్న మంగళగిరి అత్యంత కీలకమైన ప్రాంతమని మురళీకృష్ణ పేర్కొన్నారు. ఇక్కడ విధులు నిర్వహించడం గౌరవంతో పాటు సవాలుతో కూడుకున్న బాధ్యతగా భావించానన్నారు.

**వీవీఐపీ బందోబస్తులు.. ప్రశాంతంగా కార్యక్రమాలు**

తన పదవీకాలంలో పలు వీవీఐపీ బందోబస్తులు, కీలక భద్రతా ఏర్పాట్లు, వివిధ నిరసన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతిభద్రతలను పరిరక్షిస్తూ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలిగామని చెప్పారు. ఇందుకు అధికారులు, సిబ్బంది అందించిన సమన్వయం, అంకితభావం, నిరంతర సహకారమే ప్రధాన కారణమన్నారు.

**కీలక కేసుల ఛేదన**

విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ హత్య, అత్యాచారం, దోపిడీ, పోక్సో తదితర కీలక కేసులను ఛేదించగలిగామని మురళీకృష్ణ తెలిపారు. కేసుల దర్యాప్తులో అధికారులు, సిబ్బంది చూపిన వృత్తిపరమైన నిబద్ధత, సమిష్టి కృషి, అలుపెరుగని శ్రమ అభినందనీయమన్నారు. తనకు మార్గనిర్దేశం చేసి, ప్రోత్సహించిన ఉన్నతాధికారుల సూచనలు, నమ్మకం, మద్దతు విధులను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు




ఎంతో దోహదపడ్డాయని తెలిపారు.

## భారతీయ సినిమాకు తీరని లోటు

### సింగీతం మృతి వ్యక్తిగతంగా పూడ్చలేని నష్టం: బాలకృష్ణ



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. సింగీతం తమ కుటుంబానికి అత్యంత సన్నిహితులని, ఆయన మరణం వ్యక్తిగతంగా తనకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తాను మూడు విభిన్నమైన క్లాసిక్ చిత్రాల్లో నటించిన విషయాన్ని బాలకృష్ణ గుర్తుచేసుకున్నారు. 'ఆదిత్య 369', 'భైరవ ద్వీపం', 'శ్రీకృష్ణార్జున విజయం' చిత్రాలు తెలుగు సినిమాకే కాకుండా భారతీయ చిత్ర పరిశ్రమపై ప్రత్యేకమైన ముద్ర వేశాయని తెలిపారు.'ఆదిత్య 369' భారతీయ సినీ రంగంలోనే వినూత్న ప్రయోగంగా నిలిచిందని, 'భైరవ ద్వీపం' తెలుగులో కంప్యూటర్ గ్రాఫిక్స్‌ను వినియోగించిన తొలి చిత్రాల్లో ఒకటిగా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సాధించి, జానపద చిత్రాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. 'శ్రీకృష్ణార్జున విజయం'తో పౌరాణిక పాత్రను పోషించే అవకాశం దక్కిందన్నారు.ఒకే దర్శకుడి సారథ్యంలో సాంఘిక, చారిత్రక, జానపద, పౌరాణికం వంటి నాలుగు ప్రధాన జానర్లలో పాత్రలు పోషించే అవకాశం తనకు లభించడం మరపురాని అనుభూతి అని బాలకృష్ణ తెలిపారు. సింగీతంతో కలిసి పనిచేసిన ఆ జ్ఞాపకాలను జీవితాంతం మరచిపోలేనన్నారు.

**'మాయాబజార్'తో సినీ ప్రస్థానం**

తన తండ్రి, దివంగత నందమూరి తారక రామారావు తొలిసారిగా శ్రీకృష్ణుడి పాత్ర పోషించిన చిరస్మరణీయ చిత్రం లిలి'మాయాబజార్'లిలితో సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రస్థానం ప్రారంభమైందని బాలకృష్ణ గుర్తుచేశారు. ఆ చిత్రానికి మహా దర్శకుడు కె.వి.రెడ్డి వద్ద ఆయన సహాయకుడిగా పనిచేశారని తెలిపారు. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన అనేక చిత్రాలకు సింగీతం అసోసియేట్‌గా పనిచేశారని, దీంతో తమ కుటుంబంతో ఆయనకు సినిమా రంగానికి అతీతంగా ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడిందని బాలకృష్ణ వివరించారు.

**చివరి శ్వాస వరకు ప్రయోగాలు**

సింగీతం శ్రీనివాసరావు అన్ని విధాలా అసలు సిసలు దిగ్గజ దర్శకుడని బాలకృష్ణ కొనియాడారు. 94 ఏళ్ల వయసులోనూ చివరి శ్వాస వరకు వివిధ భారతీయ భాషల్లో మరపురాని సినిమా ప్రయోగాలు చేస్తూ సినీ రంగానికి సేవలందించారని పేర్కొన్నారు. సింగీతం మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు పూడ్చలేని నష్టమని, తనకు వ్యక్తిగతంగా తీరని లోటని బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తూ.. సింగీతం కుటుంబ సభ్యులకు నందమూరి కుటుంబం తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం చేయాలని

## ఎంపీ ఈటెల రాజేందర్ కు వినతి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) బీజేపీ నాయకులు జాకట ప్రేమ్ దాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సేవ సంఘం కమ్యూనిటీ హాల్ శిథిల అవస్థల్లో ఉన్న కారణంగా దాని పునర్నిర్మాణం... చేయాలని ఎంపీ వర్యులు ఈటెల రాజేందర్ కు వినతి పత్రం అందజేశారు దానికి ఎంపీ ఇతర రవీందర్ స్పందిస్తూ ఎస్సీ కమిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు..ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాకట బాబు రాజు,జాకట బాలకృష్ణ,నీరుడి ప్రకాష్,నిరుడి మహేష్, దుద్దు నర్సింగ్ రావు, వై.యాదగిరి, నిరుడి ప్రేమ్ దాస్, అంబేద్కర్ యువజన అధ్యక్షులు శ్రీనాథ్, ఉపాధ్యక్షులు ప్రశాంత్ కుమార్, కామిటీ సభ్యులు,వెంకటేష్, అరుణ్ కుమార్,భారత్, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు

## అయోధ్యలో ఎన్‌యూజే-ఐ యూనియన్ కౌన్సిల్ సమావేశం

### తెలంగాణ నుంచి టీఎస్‌జేయూ ప్రతినిధుల హాజరు..

### మంత్రి భూపేంద్రసింగ్‌కు ఘన సన్మానం






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ ) నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) (ఎన్‌యూజే-ఐ)ఆధ్వర్యంలో అయోధ్యలో అక్టోబర్ 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్న యూనియన్ కౌన్సిల్ సభ్యుల సమావేశానికి తెలంగాణ రాష్ట్రం నుంచి తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) ప్రతినిధులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో పాత్రికేయుల సమస్యలు, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన అంశాలపై చర్చలు జరుగుతున్నాయి.తెలంగాణ నుంచి టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ తోకల , ఉపాధ్యక్షురాలు పోచంపల్లి రజితశ్రీనివాస్,గౌరవ సలహాదారు సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు,కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ పటేల్,సూదుల వెంకటరమణ పటిల్, మేడ్చల్ జిల్లా ప్రతినిధులు మల్లేశం, రియాజ్, యాటరాజు, విష్ణు మోహన్, నరేష్ బుచ్చిరెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు.సమావేశానికి ముఖ్యఅతిథిగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి చౌదరి భూపేంద్ర సింగ్ హాజరై ప్రసంగించారు. పాత్రికేయుల పాత్ర, ప్రజాస్వామ్యంలో మీడియా ప్రాధాన్యం, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడినట్లు ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి చౌదరి భూపేంద్ర సింగ్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ నుంచి హాజరైన టీఎస్‌జేయూ ప్రతినిధులు జాతీయ స్థాయి సమావేశంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించినట్లు తెలిపారు.

# సారా వద్దు.. బెల్టు షాపులు ముద్దు

**- పుట్టగొడుగుల పుట్టుకస్తున్న బెల్ట్ షాపులు - కల్తీ మద్యంతో ప్రాణం ఖరాబు చేసుకుంటున్న మద్యం ప్రియులు**

(దుర్గం విజయ్ బాబు- ప్రశ్న న్యూస్ బ్యూరో)



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ముఖ్య పట్టణాలతో పాటు పలు గ్రామాల్లో అనధికారికంగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు పూర్తి విరుద్ధంగా కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళల్లోనూ మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా మద్యం అందుబాటులో ఉండటంతో యువత, కార్మికులు, నిరుపేద కుటుంబాలపై దాని ప్రభావం పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రాత్రి వేళల్లోనూ విక్రయాలా.?

కొన్ని బెల్ట్ షాపులు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగుతున్నాయనే ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా ప్రశ్నలు వస్తున్నాయి. జరిగితే వాటి వెనుక ఎవరున్నారు అనేది ప్రశ్నార్థకం. అధికారులు పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ వినిపిస్తోంది.బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాల్సి వస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

### ఎంఆర్‌పీకి మించి.. అదనపు వసూళ్ల ఆరోపణలు.

గ్రామాల్లోని అనధికారిక మద్యం విక్రయ కేంద్రాల వద్ద ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మద్యం బాటిళ్లపై ప్రత్యేక స్టిక్కర్లు అంటించి అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతితో నడిచే మద్యం దుకాణాల నుంచి బయటకు వెళ్లే మద్యం బెల్ట్ షాపులకు ఎలా చేరుతోంది.? దాని ధరలు ఎవరు నిర్ణయిస్తున్నారు. బాటిళ్లపై అదనపు స్టిక్కర్లు ఎవరు వేస్తున్నారు. అనే ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

### బెల్ట్ షాపు.. గ్రామానికి మరో సమస్య

గ్రామాల్లో 24 గంటల పాటు మద్యం సులభంగా అందుబాటులోకి రావడంతో కొంతమంది యువకులు, పురుషులు మద్యం సేవనానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం ఆరోగ్యానికి హానికరమని తెలిసినా అందుబాటులో ఉండటం వల్ల అలవాటు పెరుగుతోందన్నది వారి ఆందోళన.మద్యం కొనుగోలు కోసం కుటుంబ ఆదాయంలో అధిక భాగం ఖర్చు కావడం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు వంటి సమస్యలకు మద్యపానం ఒక కారణంగా మారుతోందని పలువురు సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తండాల్లో దాడులు.. బెల్ట్ షాపులపై ఎందుకు మౌనం

ఇదే సమయంలో గిరిజన తండాల్లో సంప్రదాయంగా ఇంటి అవసరాల కోసం తయారు చేసుకునే సారా విషయంలో ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహిస్తున్న తీరుపై కొన్ని గిరిజన సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.తమ వాదన ప్రకారం, తండాల్లో దాడులు నిర్వహించే ముందు గ్రామాల్లో బహిరంగంగా లేదా అనధికారికంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై కూడా సమాన స్థాయిలో చర్యలు తీసుకోవాలి. గిరిజనులపై మాత్రమే నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారనే భావన కలగకుండా, నిబంధనలు ఉల్లంఘించే ప్రతి ఒక్కరిపైనా ఒకే విధమైన చర్యలు ఉండాలని వారు కోరుతున్నారు.అయితే సారా తయారీ, విక్రయాలకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు వేరుగా ఉన్నందున, సంప్రదాయం పేరుతో నిషేధిత మద్యం తయారీకి మినహాయింపు ఇవ్వాలన్నది కాకుండా, చట్ట అమలులో సమానత్వం పాటించాలన్నదే గిరిజన సంఘాల ప్రధాన డిమాండ్‌గా పేర్కొన్నారు.

### నకిలీ మద్యం.. కల్తీ మద్యం ఆరోపణలపై

### దృష్టి సారించాలి

మద్యం దుకాణాలు, అనధికారిక విక్రయ కేంద్రాల్లో విక్రయిస్తున్న మద్యం నాణ్యతపై కూడా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నకిలీ లేదా కల్తీ మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు నిజమా కాదా. అన్నది అధికారిక తనిఖీల ద్వారానే తేలాలని అంటున్నారు. మద్యం బాటిళ్ల బ్యాచ్ నంబర్లు, సీల్, లేబుల్, ధర, సరఫరా వివరాలు తదితర అంశాలను ఎక్సైజ్ అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు అంటున్నారు.

### ఎక్సైజ్ శాఖపై మరో కీలక ప్రశ్న

గ్రామాల్లో బెల్ట్ షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయో అధికారులకు తెలియదా.? తెలిసి ఉంటే వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. అనధికారికంగా మద్యం విక్రయించే కేంద్రాలకు మద్యం సరఫరా అవుతున్న మార్గం ఏమిటి.? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు మద్యం వెళ్తున్నట్లయితే ఆ సరఫరా గొలుసును గుర్తించడం ఎవరి బాధ్యత. అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లయితే వాటిపై తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది. అనే ప్రశ్నలకు సమాధానం అవసరమని స్థానికులు అంటున్నారు.అధికారుల కింది స్థాయి సిబ్బంది విధుల నిర్వహణపై కూడా ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచాలని, ఎక్కడైనా విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం ఉందనే ఆరోపణలు ఉంటే వాటిపై అంతర్గతంగా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన సమయం

ఇది కేవలం మద్యం విక్రయాల సమస్యగా కాకుండా ప్రజారోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, యువత భవిష్యత్తు, చట్ట అమలు వంటి అనేక అంశాలతో ముడిపడిన సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రభుత్వం మద్యం విక్రయాలపై విధించిన నిబంధనలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్నది పరిశీలించాలి. ఎక్సైజ్ అధికారులు గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించి అనధికారిక బెల్ట్ షాపులను గుర్తించాలి. అధిక ధరల వసూళ్లపై ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించాలి. నకిలీ, కల్తీ మద్యం ఆరోపణలపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలి.

### అన్ని పార్టీల నేతలు కూడా స్పందించాలి

ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు వంటి అంశాలపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.బెల్ట్ షాపులు ఎవరి ఆధ్వర్యంలో ఉన్నా ఏ పార్టీకి చెందిన వారి అండ



ఉన్నా, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంపై రాజకీయ నాయకులు అధికారులను ప్రశ్నించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### నిబంధనలు అందరికీ సమానమేనా.?

తండాల్లో నిబంధనల అమలుకు అధికారులు వెళ్లడం అవసరమే అయితే, అదే సమయంలో గ్రామాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న బెల్ట్ షాపులపై కూడా చర్యలు ఉండాలి.

### చట్టం అందరికీ సమానమైతే చర్యలు కూడా

### అందరిపైనా సమానంగా ఉండాలి

బెల్ట్ షాపులు నిజంగా ఎక్కడెక్కడ కొనసాగుతున్నాయి. వాటికి మద్యం ఎలా చేరుతోంది. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా. మద్యం నాణ్యతను ఎవరు తనిఖీ చేస్తున్నారు. రాత్రి వేళల్లో విక్రయాలను ఎవరు పర్యవేక్షిస్తున్నారు. అనే ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.తండాలపై దాడులు మాత్రమే కాదు. గ్రామాల్లోని అనధికారిక బెల్ట్ షాపులపైనా సమాన దృష్టి సారించాలి. ప్రజారోగ్యాన్ని కాపాడటం, నిబంధనలను అమలు చేయడం, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. ప్రజలు ఇప్పుడు అధికారుల నుంచి కోరుతున్నది ఒక్కటే బెల్ట్ షాపులపై సమగ్ర తనిఖీలు. నిబంధనల ఉల్లంఘనలపై పారదర్శక చర్యలు. మద్యం విక్రయాలపై కఠిన పర్యవేక్షణ. ప్రజల ప్రశ్నలకు అధికారుల సమాధానం ఏమిటో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తాగునీటిలో పురుగులు

**- శాంతినగర్ జలమండలి అధికారుల నిర్లక్ష్యం - కలుషిత నీటితో స్థానికుల భయాందోళన**

**- ఫిర్యాదులు చేసినా స్పందించని జలమండలి అధికారులు**

సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలోని శాంతినగర్ జలమండలి పరిధిలో తాగునీటి సరఫరాపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా ఇళ్లకు వస్తున్న నీటిలో పురుగులు కనిపించడంతో పాటు, నీరు దుర్వాసనతో, కలుషితంగా వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీటి కోసం ఆధారపడుతున్న కుటుంబాలు ప్రతిరోజూ నీటిని వినియోగించే ముందు పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

### తాగునీటిలో పురుగులు.. కలకలం

స్థానికుల కథనం ప్రకారం, కొన్ని రోజులుగా సరఫరా అవుతున్న నీటిలో చిన్నచిన్న పురుగులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో మురుగు నీటిని తలపించే విధంగా నీరు రావడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు. తాగునీరు కలుషితమైందనే అనుమానంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

### డ్రైనేజీ నీరు కలుస్తోందా.?

తాగునీటి పైపులైన్లకు డ్రైనేజీ నీరు కలిసే అవకాశం ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పైపులైన్ల లీకేజీలు, డ్రైనేజీ కనెక్షన్లు, నీటి నాణ్యతను వెంటనే పరీక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### మేనేజర్ నుంచి జీఎం వరకు ఫిర్యాదులు

శాంతినగర్ లాలాపేట ప్రాంతాలలో నిత్యం కలుషిత నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదులు ఇచ్చిన సమస్యను పరిష్కరించాలంటూ స్థానికులు జలమండలి మేనేజర్, డిప్యూటీ మేనేజర్, జీఎం స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడంతో అధికారుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజారోగ్యంపై ముప్పు రాకముందే చర్యలు తీసుకోవాలి





శాంతినగర్ జలమండలి పరిధిలో కలుషిత నీటిని తాగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించాలని, పైపులైన్లను తనిఖీ చేయాలని, సమస్యకు మూలకారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం జలమండలి ప్రాథమిక బాధ్యత అని, ఇకనైనా అధికారులు స్పందించి శాంతినగర్, లాలాపేట ప్రాంతాలలో కలుషిత నీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## దళిత మహిళపై కాంగ్రెస్ నేత దాడి



నల్లగొండ (ప్రశ్న న్యూస్) నల్గొండ జిల్లా పీ.కే.మల్లేపల్లి గ్రామసభలో పొదుపు సంఘాల డబ్బుల వివాదంలో ఆదివారం నాడు దళిత మహిళ, విఓఏ మాధవిపై స్థానిక కాంగ్రెస్ నేత అమర్నాథ్ గౌడ్ దాడికి పాల్పడ్డారు. గ్రామసభలో డబ్బుల విషయంలో వాగ్వాదానికి దిగి, మాధవి చెంప పగలగొట్టి, జుట్టు పట్టుకుని ఈడ్చి కోట్టి కింద పడేశారు. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అమర్నాథ్ గౌడ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అమర్నాథ్ గౌడ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## సింగీతం మృతికి.. పవన్ కళ్యాణ్ సంతాపం

**పుష్పక విమానం, ఆదిత్య 369 వంటి ప్రయోగాత్మక**

**చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు**



అమరావతి(ప్రశ్న న్యూస్) ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మృతిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.భారతీయ చలన చిత్ర పరిశ్రమకు సింగీతం శ్రీనివాసరావు విభిన్న చిత్రాలను అందించారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పుష్పక విమానం, విచిత్ర సోదరులు, మయూరి, ఆదిత్య 369, మైకేల్ మదన కామరాజు వంటి చిత్రాల్లో ఆయన చేసిన ప్రయోగాలు, చూపిన సృజన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయని గుర్తుచేశారు.అమెరికా అమ్మాయి, పంతులమ్మ వంటి చిత్రాల్లో ఆయన రూపొందించిన గీతాలు ఎంతో ప్రాచుర్యం పొందాయని తెలిపారు. 94 ఏళ్ల వయసులోనూ సింగ్ గీతం చిత్రానికి దర్శకత్వం వహించడం సినిమా పట్ల ఆయనకున్న ఆసక్తి, అంకితభావానికి నిదర్శనమన్నారు.సింగీతం శ్రీనివాసరావు మరణం తెలుగు, భారతీయ చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు పవన్ కళ్యాణ్ సానుభూతి తెలిపారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డుపై భద్రతా చర్యలు ముమ్మరం

**కొండచరియలు విరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన**

**దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్**

**దసరా ఉత్సవాల వేళ భక్తుల రక్షణే ప్రథమ ప్రాధాన్యం**

**తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలి.. శాశ్వత పరిష్కారాలపైనా దృష్టి**




విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో భద్రతా చర్యలను మరింత ముమ్మరం చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని ఆదివారం మధ్యాహ్నం ఆయన పరిశీలించారు. అక్కడ చేపడుతున్న రక్షణ చర్యలను సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

### భక్తుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం

రాబోయే దసరా ఉత్సవాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నందున వారి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ జారీ చేసిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన కమిటీ చేసిన సిఫార్సులను కచ్చితంగా పాటిస్తూ రక్షణ పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. అవసరమైన తక్షణ రక్షణ చర్యలను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు.

### శాశ్వత పరిష్కారాలపై దృష్టి

ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక రక్షణ పనులతో పాటు భవిష్యత్తులో కొండచరియలు విరిగిపడకుండా శాశ్వత పరిష్కార మార్గాలను కూడా అన్వేషించాలని రామచంద్ర మోహన్ సూచించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.నిర్దేశించిన రక్షణ చర్యలు పూర్తయిన వెంటనే వాటి అమలుపై సమగ్ర నివేదిక (కంప్లయన్స్ రిపోర్టు)ను దేవస్థానం నుంచి సమర్పించాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## విమానాన్ని కూల్చేయాలనుకున్నా

**- ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్-హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588